



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 130 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కావలి, నెల్లూరుజిల్లా ఆదివారం 22 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 130 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAVALI, NELLORE DIST, SUN 22 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : ,SPSR Nellore, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa, Hyderabad, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## లక్ష ఉద్యోగాలతో ఏపీలో
# అతిపెద్ద స్టీల్ ప్లాంట్...
## శంకుస్థాపన చేయనున్న సీఎం చంద్రబాబు

- అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు శంకుస్థాపన
- రూ.1.35 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో లక్ష మందికి ఉద్యోగావకాశాలు
- ఈనెల 23న కేంద్ర మంత్రులతో కలిసి భూమిపూజ చేయనున్న సీఎం చంద్రబాబు
- అనుబంధంగా క్యాప్టివ్ పోర్టు నిర్మాణం.. మరో 6,000 మందికి ఉపాధి
- ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సంపూర్ణ సహకారం



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో మరో భారీ ముందడుగు పడుతోంది. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు గత 21 నెలలుగా కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాలనిస్తున్నాయి. ప్రపంచ ప్రఖ్యాత ఉక్కు ఉత్పాదక సంస్థ ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా (ఏఎంఎన్ఎస్ ఇండియా), రాష్ట్రంలో అతిపెద్ద గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధమైంది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో ఈనెల 23వ తేదీన (సోమవారం) ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, కేంద్ర మంత్రులతో కలిసి భూమిపూజ చేయనున్నారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రాన్నే మార్చగలదని నిపుణులు అంచనా వేస్తున్నారు.

**లక్ష ఉద్యోగాలతో భారీ ప్రాజెక్టు**

సుమారు రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో 5,465 ఎకరాల విస్తీర్ణంలో ఈ స్టీల్ ప్లాంట్ నిర్మాణం జరగనుంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. మొత్తం రెండు దశల్లో ఈ ప్రాజెక్టును పూర్తి చేయనున్నారు. తొలిదశలో 7.3 మిలియన్ మెట్రిక్ టన్నులు, రెండో దశలో 10.5 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే, ఈ ప్లాంట్ ఏడాదికి 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేస్తుంది. దేశీయంగా పెరుగుతున్న ఉక్కు డిమాండ్‌ను అందుకోవడంలో ఈ ప్లాంట్ కీలక పాత్ర పోషించనుంది.

**అనుబంధంగా క్యాప్టివ్ పోర్టు.. మరో 6,000 ఉద్యోగాలు**

ఈ భారీ స్టీల్ ప్లాంట్‌కు అనుబంధంగా ఏఎంఎన్ఎస్ ఇండియా సంస్థ ప్రత్యేకంగా ఒక క్యాప్టివ్ పోర్టును కూడా నిర్మించనుంది. ఇందుకోసం అదనంగా రూ.11,198 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. 316 ఎకరాల్లో 50 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఈ పోర్టును అభివృద్ధి చేస్తారు. ఈ పోర్టు నిర్మాణం ద్వారా మరో 6,000 మందికి ఉపాధి లభించనుంది. ఈ స్టీల్ ప్లాంట్, క్యాప్టివ్ పోర్టు రాకతో విశాఖ ఎకనమిక్ రీజియన్ ఒక ప్రధాన పారిశ్రామిక కేంద్రంగా (హబ్) రూపాంతరం చెందనుంది.

**ప్రభుత్వం సంపూర్ణ సహకారం**

ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోంది. పరిశ్రమకు అవసరమైన నీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలను శరవేగంగా కల్పిస్తోంది. ప్లాంట్‌ను జాతీయ రహదారి-16తో అనుసంధానించేందుకు 4 లేన్ల రహదారి విస్తరణ పనులను కూడా ప్రభుత్వం చేపట్టింది.

**సీఎం పర్యటన వివరాలు**

సోమవారం జరిగే శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఆయన అమరావతి నుంచి హెలికాప్టర్ ద్వారా మధ్యాహ్నం రాజయ్యపేటకు చేరుకుంటారు.

- మిగతా 2లో



## ఇరాన్‌పై దాడులు మరింత తీవ్రం చేస్తాం ఇజ్రాయెల్ రక్షణ మంత్రి

- యుద్ధం లక్ష్యాలను సాధించేవరకు ఆపేది లేదని స్పష్టీకరణ
- ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త వైమానిక దాడులు ఉధృతం చేస్తామన్న కాట్జ్
- ఆ దేశ పాలనా యంత్రాంగం, కమాండర్లను లక్ష్యంగా చేసుకుంటామని వెల్లడి

- మిగతా 2లో



## దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవికి ముప్పు?
### స్పీకర్ తీర్పుపై హైకోర్టులో బీజేపీ సవాల్

- తెలంగాణ రాజకీయాల్లో ప్రకంపనలు పుట్టిస్తున్న పార్టీ ఫిరాయింపుల అంశం
- ఇటీవల దానం సహా అందరికీ క్లీన్ చిట్ ఇచ్చిన అసెంబ్లీ స్పీకర్
- స్పీకర్ నిర్ణయాన్ని హైకోర్టులో సవాల్ చేసిన ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- దానంపై అనర్హత వేటు వేయాలని కోర్టును కోరిన ఏలేటి
- పిటిషన్ పై సోమవారం విచారణ చేపట్టే అవకాశం

- మిగతా 2లో



## శ్రీవారి క్షేత్ర పవిత్రతను కాపాడటమే మా ప్రధాన లక్ష్యం

- టీటీడీ ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు సమీక్ష
- సామాన్య భక్తులకు త్వరితగతిన దర్శనం కోసం టెక్నాలజీ వినియోగించాలని ఆదేశం
- లడ్డూ ప్రసాదం నాణ్యత విషయంలో రాజీ పడొద్దని అధికారులకు స్పష్టం
- టీటీడీ ద్వారా రూ.750 కోట్లతో 5 వేల నూతన ఆలయాల నిర్మాణ ప్రణాళిక
- పేదలకు వైద్య సేవలు అందించే ప్రాణదానం కార్యక్రమాన్ని విస్తృతం చేయాలని సూచన

పెన్ పవర్ డెస్క్:కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి కొలువై ఉన్న తిరుమల క్షేత్ర పవిత్రతను కాపాడటం, భక్తుల మనోభావాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. తిరుమలలో శనివారం ఆయన టీటీడీ ఉన్నతాధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా, భక్తుల విశ్వాసాన్ని మరింతగా చూరగొనేలా, పారదర్శకమైన, అత్యున్నత ప్రమాణాలతో కూడిన సేవలు అందించాలని అధికారులను దిశానిర్దేశం చేశారు.

- మిగతా 2లో

## తండ్రి గౌరవం కోసం ఒకరు.. ఆస్తుల కోసం మరొకరు!
### సోమిరెడ్డి ఆసక్తికర విశ్లేషణ



- జగన్ తన స్వార్థం కోసం సొంత కుటుంబాన్నే రోడ్డుపైకి ఈడ్చారన్న సోమిరెడ్డి
- తండ్రి అధికారాన్ని అడ్డు పెట్టుకుని జగన్ వేల కోట్లు సంపాదించారని ఆరోపణ
- లోకేశ్ మాత్రం తండ్రి గౌరవం కోసం కృషి చేస్తున్నారని కితాబు


- మిగతా 2లో

## ఆధునిక యుద్ధాలు ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీస్తున్నాయి

- యుద్ధం అంటే సరిహద్దుల్లో జరిగే ఘర్షణ మాత్రమే కాదన్న రాజ్‌నాథ్
- సరిహద్దులను దాటి ఆర్థిక, డిజిటల్, ఇంధన భద్రతలపై ప్రభావం పడుతోందని వ్యాఖ్య
- ప్రతి పౌరుడు, యువత దేశ రక్షణకు సిద్ధమై ఉండాలని పిలుపు

పెన్ పవర్ డెస్క్:ఆధునిక యుద్ధాలు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థలను, సైబర్ స్పేస్‌ను దెబ్బతీస్తున్నాయని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. నేటి రోజుల్లో యుద్ధం అంటే కేవలం సరిహద్దుల్లో జరిగే ఘర్షణ మాత్రమే కాదని అన్నారు. యుద్ధం సరిహద్దులను దాటి ఆర్థిక, డిజిటల్, ఇంధన, ఆహార భద్రతలో భాగమయ్యాయని పేర్కొన్నారు. వాటి ద్వారా ఒక దేశం మరో దేశాన్ని బలహీనపరిచే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రతి దేశపౌరుడు అన్ని సమయాల్లో దేశ రక్షణకు సిద్ధమై ఉండాలని కేంద్రమంత్రి పిలుపునిచ్చారు. ఆధునిక యుద్ధాలకు అనుగుణంగా దేశంలో ఆయుధ సంపత్తిని అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో భాగంగా సాయుధ దళాలకు ఆధునాతన, స్వదేశీ ఆయుధాలు,

- మిగతా 2లో





## దాడులు నిలిపివేసి, హర్మూజ్ జలసంధిని తెరవండి
### ఇరాన్‌కు 22 దేశాల విజ్ఞప్తి

- అరబ్ దేశాలపై దాడులను నిలిపివేయాలని విజ్ఞప్తి
- హర్మూజ్ జలసంధిని తెరవాలన్న 22 దేశాలు
- అదే సమయంలో వాణిజ్య నౌకలు, మౌలిక సదుపాయాలపై దాడులపై ఆగ్రహం

పెన్ పవర్ డెస్క్:అరబ్ దేశాలపై దాడులను నిలిపివేసి, హర్మూజ్ జలసంధిని తక్షణమే తెరవాలని యూకే, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, యూఏఈ, బహ్రెయిన్ సహా 22 దేశాలు ఇరాన్‌కు విజ్ఞప్తి చేశాయి. అమెరికా-ఇజ్రాయెల్,

- మిగతా 2లో

### పీఎస్‌యూ ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 62కి పెంపు..
## సానుకూలంగా ప్రభుత్వం!

- ప్రతిపాదనకు కేబినెట్ సబ్ కమిటీ సూత్రప్రాయ అంగీకారం
- రాష్ట్రవ్యాప్తంగా 8,500 మందికి లబ్ధి చేకూరే అవకాశం
- త్వరలో ప్రభుత్వం నుంచి అధికారిక ప్రకటన వెలువడే ఛాన్స్



పెన్ పవర్ డెస్క్:ఏపీలోని ప్రభుత్వ రంగ సంస్థలు (పీఎస్‌యూ), గురుకుల సొసైటీ పాఠశాలల ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పేందుకు సిద్ధమవుతోంది. వీరి పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచే ప్రతిపాదనకు ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది.

- మిగతా 2లో

## తిరుమలలో అత్యాధునిక ఫుడ్ ల్యాబ్ ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- తిరుమలలో సీఎం చంద్రబాబు పర్యటన
- తిరుమలలో ఫుడ్, వాటర్ అనాలసిస్ ల్యాబ్ ప్రారంభం
- రూ.25 కోట్ల వ్యయంతో టీటీడీ ఆధ్వర్యంలో ల్యాబ్ నిర్మాణం
- మనవడు దేవాన్ష్ పుట్టినరోజున కుటుంబంతో కలిసి శ్రీవారి దర్శనం
- అన్నదానం ట్రస్టుకు రూ.44 లక్షల విరాళం అందించిన సీఎం కుటుంబం

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# ఆచితూచి రూపొందించిన వాస్తవిక బడ్జెట్

ప్రపంచవ్యాప్తంగా మారుతున్న భౌగోళిక పరిస్థితులు, రాష్ట్ర ఆర్థిక వనరులు, పెరుగుతున్న ద్రవోల్బణం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకొని ఆచితూచి రూపొందించిన వాస్తవిక బడ్జెట్‌గా శుక్రవారం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కనబడుతుంది. ప్రతిపాదించిన 3,24,234 కోట్ల బడ్జెట్‌లో ప్రాధాన్యతా రంగాలుగా విద్యారంగానికి రూ. 26,674 (8.22%) కోట్లు, వైద్య రంగానికి రూ. 13,679 (4.21%) కోట్లు, వ్యవసాయ రంగానికి రూ. 23,179 (7.14%) కోట్లు బీసీ సంక్షేమ రంగానికి రూ. 12,511 (3.85%) కోట్లు, గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్‌లు ఉన్నాయి. సామాన్యుని సంపాదనలో సింహభాగం విద్యా, వైద్యలకే ఖర్చు అవుతుంది. విద్యా, వైద్య రంగాలకు పెద్దపీట వేసిన రాష్ట్రాలు అభివృద్ధి సూచికలో ముందు వరుసలో ఉన్నాయి. గత బడ్జెట్‌తో పోల్చుకుంటే ఈ బడ్జెట్‌లో విద్యారంగానికి, వైద్య రంగానికి, బీసీ సంక్షేమానికి అధికంగా కేటాయించారు. విద్య వైద్య రంగానికి అధిక కేటాయింపులు చేస్తే ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందే అవకాశం మెరుగవుతుంది. దేశంలో నాణ్యమైన విద్యను అందించడం కోసం ఆయా రాష్ట్రాలు వాటి బడ్జెట్లో బిహార్ 21.7% ఢిల్లీ 21.4% రాజస్థాన్ 19% హిమాచల్ ప్రదేశ్ 18.9% విద్యా రంగానికి నిధులు కేటాయించాయి. అదే దక్షిణాది రాష్ట్రాల బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపుల్ని ఒకసారి పరిశీలిస్తే, తమిళనాడు 14%, ఒడిస్సా 14% కేరళ 13.4% ఆంధ్రప్రదేశ్ 12.6% కేటాయింపులు జరిపాయి. మేము అధికారంలోకి వస్తే విద్యారంగానికి కనీసం 15% నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత మూడు సంవత్సరాల బడ్జెట్లలో 7.3% ,7.57%, 8.22% నిధులు మాత్రమే కేటాయించింది.

బడ్జెట్‌లో చెబుతున్నట్లు యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్‌కి కనీసం 9 వేల కోట్లు, పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం అందించడానికి 250 కోట్లు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం 170 కోట్లు, పాలిటె క్నిక్ కళాశాల అప్‌గ్రెడేషన్ కోసం 2500 కోట్లు అవసరంఅవుతాయని విద్యాశాఖ ప్రాథమిక అంచనా వేసింది. తీరా బడ్జెట్ కేటాయింపులు పరిశీలిస్తే, విద్యారంగానికి గత సంవత్సరంతో పోల్చితే 0.65% అధికంగా కేటాయింపులు ఈ బడ్జెట్‌లో జరిగాయి. ఈ నామమాత్రం పెంపుదల కేటాయింపులతో తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు ప్రపంచ స్థాయితో పోటీపడాలన్న ప్రభుత్వ లక్ష్యం ఏ విధంగా నెరవేరుతుందన్నది ప్రశ్న. అయితే బడ్జెట్‌లో విద్యార్థులకు అల్పాహారం, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, ఐటీఐ, ఐటీసీల్లో చదివే విద్యార్థులకు 2000 స్కాలర్‌షిప్ అందించే ప్రతిపాదనలు హర్షనీయం. ప్రాథమిక విద్యను బలోపేతం చేయడానికి 33 జిల్లాలలో 1,362 ప్రీ-ప్రైమరీ సెక్షన్లు ఏర్పాటు, రాబోయే విద్యా సంవత్సరంలో ఈ కార్యక్రమాన్ని 2,000 నుండి 2,500 ప్రభుత్వ పాఠశాలలకు విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయడం ప్రాథమిక విద్య బలోపేతానికి దోహదపడుతాయి. చదువు లేకపోతే జ్ఞానం రాదు, జ్ఞానం రాకపోతే నైతిక విలువలు ఉండవు, నైతిక విలువలు లేకపోతే అభివృద్ధి సాధ్యం కాదు, సమాజంలోని అట్టడుగు వర్గాలకు విద్య ఉంటే ఇవన్నీ సాధ్యమవుతాయని పూలే చెప్పిన మాటలు గమనంలోకి తీసుకొని విద్యారంగానికి కనీసం 15%- 20% నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. కరోనా తర్వాత ప్రజల్లో ఆరోగ్య స్పృహ పెరిగింది. బడ్జెట్‌లో 4.21% నిధులతో తెలంగాణ రాష్ట్రంలోని ప్రజలకి నాణ్యమైన వైద్య సదుపాయాలు అందించడం కష్టం. గత ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే కేవలం రూ.1286 కోట్లు ఈ బడ్జెట్లో అధికంగా వైద్యరంగానికి కేటాయించడం జరిగింది. రాష్ట్రంలోని ఒక కోటి 15 లక్షల కుటుంబాలకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అందిస్తామని బడ్జెట్లో ప్రకటించారు. ప్రజల ఆరోగ్య భద్రతకు ఈ పథకం దోహదపడుతుంది. కానీ వైద్య రంగానికి తక్కువ కేటాయింపులతో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు ఎలా అందించగలం.

తెలంగాణ రాష్ట్రంలో 56.39% బీసీలు ఉన్నారని ప్రభుత్వ అధికారిక గణాంకాలు తెలియజేస్తున్నాయి. బడ్జెట్లో బీసీ సంక్షేమానికి కేవలం 3.85% నిధుల కేటాయింపు మాత్రమే జరిగింది. రాష్ట్ర జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలకు మరీ ఇంత తక్కువ బడ్జెట్ కేటాయింపులు వారి సంక్షేమానికి ఏ విధంగా సరిపడతాయి? ఎస్సీ ఎస్టీ మైనారిటీల సంక్షేమానికి కూడా కేటాయింపుల్లో ఏ పెంపుదలా లేకపోవడం గమనార్హం. ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలకు కేటాయించిన నిధులకు ఏ మాత్రం పొంతన లేదు. విద్యారంగానికి ప్రాధాన్యతమిస్తున్నామని చెబుతూనే నామమాత్ర పెంపుతో కేటాయింపులు జరిపారు. రైతును రాజును చేస్తామని చెబుతూ రైతన్న సంక్షేమానికి, వ్యవసాయానికి వెన్ను దన్నుగా నిలిచే చర్యలు లేకపోవడం గమనార్హం. ఉద్యోగ ఉపాధ్యాయుల సంక్షేమని కట్టుబడి ఉన్నామని చెబుతూ పీఆర్సీపై ఎలాంటి ప్రతిపాదన లేకపోవడం, కేవలం ఈహెచ్ఎస్ గురించిన ప్రస్తావన చేశారు. స్థూలంగా బడ్జెట్‌ని విశ్లేషిస్తే అంతంత మాత్రమే ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, ప్రపంచ వ్యాప్త భౌగోళిక పరిస్థితికి అడ్డం పడుతూ సంక్షేమ రంగానికి నిధుల కేటాయింపు కొనసాగిస్తూ ఆచితూచి రూపొందించిన వాస్తవిక బడ్జెట్‌గా ఉంది.

# శ్రీవారి క్షేత్ర పవిత్రతను కాపాడటమే మా ప్రధాన లక్ష్యం

- మొదటి పేజి తరువాయి

**సాంకేతికతతో సామాన్యులకు పెద్దపీట**

సామాన్య భక్తులు క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉండే సమయాన్ని తగ్గించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. టెక్నాలజీ సహాయంతో భక్తుల రద్దీని సమర్థవంతంగా నియంత్రించి, వారికి సులభంగా, త్వరితగతిన స్వామివారి దర్శనం కల్పించాలని ఆదేశించారు. ఇది భక్తులపై మానసిక ఒత్తిడిని తగ్గించడమే కాకుండా, దర్శన ప్రక్రియలో పారదర్శకతను పెంచుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

**ప్రసాదం నాణ్యతలో రాజీ వద్దు**

శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని చంద్రబాబు గట్టిగా హెచ్చరించారు. ప్రసాదాల తయారీలో వినియోగించే నెయ్యి, ఇతర ముడి సరుకుల నాణ్యతను పరీక్షించేందుకు ఏర్పాటు చేసిన అత్యాధునిక ల్యాబ్‌ను పటిష్టంగా నిర్వహించాలని, కల్తీకి ఏమాత్రం ఆస్కారం ఇవ్వరాదని స్పష్టం చేశారు. తాను స్వయంగా కొందరు భక్తులను కలిసినప్పుడు వారు ప్రసాదం నాణ్యతపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారని, ఆ నమ్మకాన్ని నిరంతరం కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని గుర్తుచేశారు.

**పేదలకు అండగా సేవలు.. ధర్మప్రచారానికి పెద్దపీట**

"పేదల సేవయే భగవంతుని సేవ" అనే స్ఫూర్తితో టీటీడీ నిర్వహిస్తున్న కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని చంద్రబాబు పిలుపునిచ్చారు. టీటీడీ ఆధ్వర్యంలోని స్విమ్స్, బర్డ్, శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ వంటి వైద్య సంస్థల ద్వారా అందిస్తున్న సేవలపై ఆయన ప్రత్యేకంగా సమీక్షించారు. అరుదైన వ్యాధులతో బాధపడే పేద రోగుల చికిత్స కోసం ప్రాణదానం ట్రస్ట్ ద్వారా నెలకు అదనంగా రూ.1 కోటి నిధులను సమకూరుస్తున్నట్లు అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు.

దివంగత ఎన్టీఆర్ హయాంలో ప్రారంభమైన అన్నదానం కార్యక్రమాన్ని టీటీడీ పరిధిలోని 57 ఆలయాల్లో విజయవంతంగా నిర్వహిస్తున్నారని, త్వరలోనే మరో 4 ఆలయాల్లో ప్రారంభిస్తామని అధికారులు వివరించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలోని ఇతర ప్రధాన దేవాలయాల్లో కూడా అమలు చేసేలా చూడాలని సీఎం సూచించారు. ధర్మప్రచారంలో భాగంగా టీటీడీ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ.750 కోట్ల వ్యయంతో 5,000 నూతన ఆలయాల నిర్మాణ ప్రణాళికను ముఖ్యమంత్రి సమీక్షించారు. అంతేకాకుండా, దేశంలోని ప్రతి రాష్ట్ర రాజధానిలోనూ తిరుమల శ్రీవారి ఆలయం తరహాలో ఆలయాలు నిర్మించే ప్రతిపాదనలపై దృష్టి సారించాలని ఆదేశించారు.

**శ్రీవారి సేవకుల సేవలను వినియోగించుకోవాలి**

తిరుమల కొండపై శ్రీవారి సేవకుల సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఇప్పటివరకు 17.12 లక్షల మంది సేవకులు తమ సేవలను అందించారని, సాధారణ రోజుల్లో 3000 మంది, రద్దీ రోజుల్లో 4000 మంది వరకు సేవకులు భక్తులకు సేవలందిస్తున్నారని అధికారులు సీఎంకు వివరించారు. అన్నదానం, క్యూలైన్ల నిర్వహణ వంటి కీలక విభాగాల్లో వారి సేవలను మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాలని సీఎం సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, పలువురు ప్రజాప్రతినిధులు, టీటీడీ ఉన్నతాధికారులు, తిరుపతి జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితరులు పాల్గొన్నారు.

# ఇరాన్‌పై దాడులు మరింత తీవ్రం చేస్తాం

ఇరాన్‌పై వచ్చేవారం దాడులు మరింత తీవ్రతరం చేస్తామని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ హెచ్చరించారు. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్త వైమానిక దాడులు ఉద్ధృతం చేస్తామని కాట్జ్ తెలిపినట్లుగా ఇజ్రాయెల్ పత్రిక ఒకటి తెలిపింది. ఇరాన్ పాలకులు, ఆ దేశానికి ఆదాయవనరుగా ఉన్న మౌలిక సదుపాయాలపై తమ రెండు దేశాలు జరిపే దాడులు మరింత పెరుగుతాయని అన్నారు.ఈ యుద్ధం లక్ష్యాలను సాధించేవరకు ఆపేది లేదని కాట్జ్ స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ భద్రతకు, అమెరికా ప్రయోజనాలకు పొంచి ఉన్న ముప్పు తొలగిపోయే వరకు ఆ దేశ పాలనా యంత్రాంగం, కమాండర్లు, వ్యూహాత్మక సామర్థ్యాలను లక్ష్యంగా చేసుకుంటామని స్పష్టం చేశారు.

ఇరాన్‌పై క్రమంగా సైనిక చర్యను తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన గంటల వ్యవధిలో ఇజ్రాయెల్ మంత్రి నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం. ఇరాన్ నుంచి అణుముప్పును తొలగించడం, దాని సైనిక సామర్థ్యాలను దెబ్బతీయడం, ఆ దేశ ప్రజలకు స్వేచ్ఛను కల్పించడమే తమ ముందున్న లక్ష్యాలని అంతకుముందు ఇజ్రాయెల్ ప్రధాని బెంజామిన్ నెతన్యాహూ అన్నారు.

# దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవికి ముప్పు?

తెలంగాణ రాజకీయాల్లో ఫిరాయింపుల పర్వం ఇప్పుడు న్యాయస్థానానికి చేరింది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పార్టీ మారలేదని అసెంబ్లీ స్పీకర్ ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. స్పీకర్ నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలని తన పిటిషన్ లో ఆయన కోర్టును కోరారు. గత లోక్‌సభ ఎన్నికల్లో దానం నాగేందర్ కాంగ్రెస్ పార్టీ తరపున సికింద్రాబాద్ ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన విషయాన్ని ఏలేటి తన పిటిషన్‌లో ప్రధానంగా ప్రస్తావించారు. ఒక పార్టీ గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచి, మరో పార్టీ తరపున ఎంపీగా పోటీ చేయడం పక్కాగా ఫిరాయింపు కిందికే వస్తుందని ఆయన పేర్కొన్నారు.

నామినేషన్ పత్రాలనే ఆధారంగా తీసుకుని దానం నాగేందర్‌పై తక్షణమే అనర్హత వేటు వేయాలని ఏలేటి డిమాండ్ చేశారు. అంతేకాకుండా, పార్టీ మారినప్పటి నుంచి ఆయన ఎమ్మెల్యేగా పొందుతున్న జీతభత్యాలను వెనక్కి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు స్వీకరించింది. దీనిపై సోమవారం విచారణ చేపట్టే అవకాశం ఉంది. ఇప్పటికే తెలంగాణలో పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కు దగ్గరైన నేపథ్యంలో, దానం నాగేందర్ కేసులో హైకోర్టు ఇచ్చే తీర్పు మిగిలిన ఫిరాయింపు ఎమ్మెల్యేల భవిష్యత్తును కూడా శాసించే అవకాశం ఉంది.

# తిరుమలలో అత్యాధునిక ఫుడ్ ల్యాబ్ ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

తిరుమల శ్రీవారి భక్తులకు అందించే ప్రసాదాలు, అన్నప్రసాదాల నాణ్యతను మరింత పెంచే దిశగా కీలక అడుగు పడింది. తిరుమలలో స్టేట్ ఫుడ్ లాబరేటరీ, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సహకారంతో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిర్మించిన అత్యాధునిక వాటర్ అండ్ ఫుడ్ అనాలసిస్ ల్యాబ్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ప్రారంభించారు. సుమారు రూ.25 కోట్ల వ్యయంతో ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేశారు. ప్రసాదాల తయారీకి వినియోగించే నెయ్యి, పప్పులు, ఇతర ముడిసరుకుల నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షించి, భక్తులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన ప్రసాదాలు అందించాలనే లక్ష్యంతో ఈ ల్యాబ్‌ను అందుబాటులోకి తెచ్చారు.ఇవాళ ముఖ్యమంత్రి చంద్రబాబు తన కుటుంబ సభ్యులతో కలిసి కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మనవడు దేవాన్ష్ జన్మదినాన్ని పురస్కరించుకుని తిరుమల వచ్చిన సీఎం వెంట ఆయన అర్థాంగి నారా భువనేశ్వరి, కుమారుడు, మంత్రి నారా లోకేశ్, మనవడు దేవాన్ష్ ఉన్నారు. ముఖ్యమంత్రి హోదాలో మహాద్వారం ద్వారా నేరుగా ఆలయ ప్రవేశం చేసే అవకాశం ఉన్నప్పటికీ, తన ఆనవాయతీని కొనసాగిస్తూ సామాన్య భక్తుడిలాగే వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారానే స్వామివారి దర్శనానికి వెళ్లారు. సీఎం అయిన తొలిసారి నుంచి ఆయన ఇదే పద్ధతిని పాటిస్తున్నారు. దర్శనం అనంతరం వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనాలు అందించగా, టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.ప్రతి ఏటా మనవడు దేవాన్ష్ పుట్టినరోజున అన్నదాన ట్రస్టుకు విరాళం ఇచ్చే సంప్రదాయాన్ని చంద్రబాబు కుటుంబం కొనసాగిస్తోంది. ఈ ఏడాది కూడా ఒకరోజు అన్నప్రసాద వితరణకు అయ్యే ఖర్చు రూ.44 లక్షల విరాళాన్ని అన్నదానం ట్రస్టుకు అందజేశారు. దేవాన్ష్ పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు 12 సార్లు ఈ విరాళాన్ని అందించారు.

దర్శనానంతరం సీఎం, ఆయన కుటుంబ సభ్యులు కాలినడకన తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనానికి చేరుకున్నారు. అక్కడ భోజనం చేస్తున్న భక్తులకు స్వయంగా అన్నప్రసాదాలను వడ్డించి, వారి సేవలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులతో ముచ్చటిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. మాడ వీధుల్లో నడుచుకుంటూ వెళుతున్న ముఖ్యమంత్రిని చూసేందుకు భక్తులు ఆసక్తి చూపారు. ఈ క్రమంలో, చంద్రబాబు తన సెక్యూరిటీ ప్రోటోకాల్ ను పక్కనపెట్టి, నేరుగా భక్తుల వద్దకు వెళ్లి వారితో కరచాలనం చేస్తూ, ఫొటోలు దిగుతూ ఆనందం కలిగించారు. ఈ క్రమంలో ఓ భక్తురాలు సీఎంకు కరుంగళి మాలను బహూకరించగా, ఆయన ఆప్యాయంగా స్వీకరించారు.

ఈ సందర్భంగా తిరుమలలో అందుతున్న సౌకర్యాలపై సీఎం భక్తులను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా లడ్డూ ప్రసాదం నాణ్యత గురించి అడగ్గా, గతంతో పోలిస్తే నాణ్యత చాలా మెరుగుపడిందని, రుచి బాగుందని భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. దర్శనం మరింత వేగంగా జరిగేలా చూడాలని కొందరు భక్తులు కోరగా, సీఎం సానుకూలంగా స్పందించారు. భక్తుల సౌకర్యార్థం ఇప్పటికే ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ వ్యవస్థను ఏర్పాటు చేశామని, త్వరలోనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీ ద్వారా శ్రీవారి దర్శనం మరింత సులభతరం, త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# లక్ష ఉద్యోగాలతో ఏపీలో అతిపెద్ద స్టీల్ ప్లాంట్...

- మొదటి పేజి తరువాయి

మధ్యాహ్నం 3:40 గంటలకు ఏర్పాటు చేసిన ఎక్స్‌పీరియన్స్ జోన్‌ను సందర్శించి, ఏఎంఎన్ఎస్ ఇండియా స్టీల్ ప్లాంట్ నమూనాను పరిశీలిస్తారు. అనంతరం కేంద్ర మంత్రులతో కలిసి శంకుస్థాపన ఫలకాన్ని ఆవిష్కరించి, అవగాహన ఒప్పందాల కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం ముగిశాక తిరిగి అమరావతికి పయనమవుతారు. ఈ భూమిపూజ కార్యక్రమానికి కేంద్ర ఉక్కు భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేశ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు అనిత, టి.జి. భరత్, ఎంపీ సి.ఎం. రమేశ్ సహా పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. ఆర్సెలర్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ లక్ష్మీ మిట్టల్, ఏఎంఎన్ఎస్ ఇండియా ఛైర్మన్ ఆదిత్య మిట్టల్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు.

# పీఎస్‌యూ ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 62కి పెంపు.. సానుకూలంగా ప్రభుత్వం!

- మొదటి పేజి తరువాయి

ఈ అంశంపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.ఈ అంశంపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, పురపాలక శాఖ మంత్రి నారాయణలతో కూడిన కమిటీ ఇప్పటికే సమావేశమైంది. పదవీ విరమణ వయసు పెంపునకు ఈ కమిటీ సూత్రప్రాయంగా అంగీకరించినట్లు తెలిసింది. ఈ నిర్ణయం అమలైతే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8,500 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూరనుంది.

ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, 9, 10 షెడ్యూల్ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపు డిమాండ్ చాలా కాలంగా పెండింగ్‌లో ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రతిపాదనలు ముందుకు సాగలేదు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ అంశంపై దృష్టి సారించి, మంత్రులతో సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. వయసు పెంపు వల్ల ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం వంటి అంశాలను కూడా కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి, ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది.కేబినెట్ సబ్ కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# దాడులు నిలిపివేసి, హర్మూజ్ జలసంధిని తెరవండి

- మొదటి పేజి తరువాయి

ఇరాన్ యుద్ధం 22వ రోజుకు చేరిన విషయం తెలిసిందే. దాడులు, ప్రతిదాడులు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. ఇరాన్ అరబ్ దేశాల్లోని అమెరికా సదుపాయాలపై వైమానిక, డ్రోన్ దాడులు చేస్తోంది.ఈ క్రమంలో 22 దేశాలు కలిసి ఇరాన్‌కు విజ్ఞప్తి చేశాయి. మరోవైపు వాణిజ్య నౌకలు, ఇంధన మౌలిక సదుపాయాలపై దాడులను ఈ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఇరాన్ చర్యలు ప్రపంచవ్యాప్తంగా ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయని ఈ దేశాలు సంయుక్త ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశాయి.

**డిగో గార్సియాపై దాడి.. తీవ్రంగా స్పందించిన బ్రిటన్**

హిందూ మహాసముద్రంలోని డిగో గార్సియా ద్వీపంలో ఉన్న యూఎస్-యూకే సైనిక స్థావరం లక్ష్యంగా ఇరాన్ క్షిపణి దాడులకు పాల్పడింది. ఈ దాడిని బ్రిటన్ తీవ్రంగా ఖండించింది. ఇరాన్ దాడులు దుస్సాహసంగా అభివర్ణించింది. పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడులు, హర్మూజ్ జలసంధి మూసివేత వంటివి తమ ప్రయోజనాలకు, తమ మిత్రదేశాలకు ముప్పుగా బ్రిటన్ రక్షణ శాఖ తెలిపింది.

# తండ్రి గౌరవం కోసం ఒకరు.. ఆస్తుల కోసం మరొకరు!

వైఎస్ కుటుంబంలో ముదిరిన ఆస్తుల తగాదాపై టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. కన్నతల్లి విజయమ్మే స్వయంగా అఫిడవిట్ విడుదల చేసి ఆవేదన వ్యక్తం చేయడం చూస్తుంటే, జగన్ తన స్వార్థం కోసం కుటుంబాన్ని ఎంతలా రోడ్డుపైకి ఈడ్చారో అర్థమవుతుందని ఆయన మండిపడ్డారు.రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అధికారాన్ని అడ్డుపెట్టుకుని జగన్ వేల కోట్లు గడించారని, కానీ ఇప్పుడు అవే ఆస్తుల విషయంలో తల్లికి, చెల్లి షర్మిలకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని సోమిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తల్లికి వ్యతిరేకంగా తన సొంత మీడియా సంస్థల్లోనే కథనాలు రాయించిన ఘనత ఒక్క జగన్‌కే దక్కుతుందని, ఇది అత్యంత దారుణమని ఆయన విమర్శించారు. ఆస్తుల కోసం కన్నతల్లిని కూడా గౌరవించకుండా ఆమెను కోర్టుల చుట్టూ, మీడియా ముందుకు వచ్చేలా చేయడం వైఎస్సార్ ఆశయాలకే విరుద్ధమని సోమిరెడ్డి పేర్కొన్నారు.జగన్ తీరుకు భిన్నంగా నారా లోకేశ్ ప్రవర్తన ఉందని సోమిరెడ్డి కొనియాడారు. తండ్రి చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బంది పెట్టినప్పుడు, లోకేశ్ విశ్రమించకుండా పోరాడి మళ్ళీ ఆయన్ను ముఖ్యమంత్రి సీటులో కూర్చోబెట్టే వరకు శ్రమించారని గుర్తు చేశారు. ఒకవైపు జగన్ తన కుటుంబంలో ఆస్తుల కోసం చిచ్చులు పెడుతుంటే, లోకేశ్ మాత్రం తండ్రి గౌరవం కోసం, ప్రజా సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని సోమిరెడ్డి విశ్లేషించారు.

# ఆధునిక యుద్ధాలు ఆర్థిక వ్యవస్థలను దెబ్బతీస్తున్నాయి

- మొదటి పేజి తరువాయి

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించేందుకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. దేశ రక్షణలో యువత తనవంతు పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.ఉత్తరాఖండ్‌లోని సైనిక పాఠశాల ఆవిర్భావ దినోత్సవంలో వర్చువల్‌గా పాల్గొన్న రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, యువత దేశం కోసం ఎటువంటి సమస్యనైనా ఎదుర్కోగలిగేలా క్రమశిక్షణ, మానసిక స్థైర్యం పెంపొందించుకోవాలని సూచించారు. సైన్యం, పౌరులు బలంగా ఉంటేనే దేశం ముందుకు సాగుతుందని అన్నారు. దేశ రక్షణలో యువత భాగస్వామ్యాన్ని ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఎన్‌సీసీలో ప్రవేశాల సామర్థ్యాన్ని పెంచాలని ప్రభుత్వం నిర్ణయించిందని అన్నారు.గతంలో 17 లక్షలుగా ఉన్న నియామకాలను 20 లక్షలకు పెంచుతున్నట్లు వెల్లడించారు. పీపీపీ నమూనాలో దేశవ్యాప్తంగా 100 కొత్త సైనిక పాఠశాలలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. సైనిక పాఠశాలల్లో బాలికలు ఎక్కువ సంఖ్యలో చేరుతున్నారని, ఇది చారిత్రాత్మక ముందడుగు అన్నారు. ఇది దేశ 'నారీ శక్తి'ని మరింత బలోపేతం చేస్తోందని అన్నారు.

# మైనారిటీ సోదరులతో ఈద్ శుభాకాంక్షలు పంచుకున్న టీడీపీ నాయకులు -- ఈద్గాల అభివృద్ధికి హామీ







శ్రీకాళహస్తి, పెన్ పవర్, మార్చి ,21: పవిత్ర ఈద్ పండుగ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు మైనారిటీ సోదరులతో కలసి శుభాకాంక్షలు పంచుకున్నారు. శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణ అధ్యక్షులు విజయ్ కుమార్ పెద్ద మసీద్ ఈదులుకుంటా ప్రాంతాన్ని సందర్శించి, అక్కడి ముస్లిం సోదరులకు ఈద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బొజ్జల గోపాల రెడ్డి హయాంలో పట్టణంలో మూడు ఈద్గాల స్థలాలు కేటాయించబడిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ స్థలాలకు అవసరమైన మౌలిక వసతులను త్వరలోనే కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఈద్గాల అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. అనంతరం విజయ్ కుమార్, ముఫ్తి నైమ్ సాహెబ్‌కు తీపి తినిపించి “ఈద్ ముబారక్” తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీకి చెందిన మైనారిటీ టౌన్ బ్యాంక్ చైర్మన్, ప్యాకేజీ గుజ్జుల మీర్జా అస్మత్ సోదరులు, ఇతర నాయకులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# పెన్ పవర్

## రాయలసీమ

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా। తిరుపతి జిల్లా। చిత్తూరు జిల్లా। వై.ఎస్.ఆర్. కడప జిల్లా।

# ఉదయగిరి ఈద్గా ప్రాంగణంలో ఘనంగా రంజాన్ ముగింపు వేడుకలు

**రంజాన్ పర్వదిన వేడుకల్లో పాల్గొన్న ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్**

**ముస్లిం సోదర సోదరీమణులకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ రంజాన్ శుభాకాంక్షలు**

**మైనారిటీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఎమ్మెల్యే కాకర్ల సురేష్**








కావలి ఆర్ సి ఇంచార్జ్ పెన్ పవర్ మార్చ్ 21 ఉదయగిరి మండల కేంద్రంలోని ఈద్గా ప్రాంగణంలో పవిత్ర రంజాన్ మాస ముగింపు సందర్భంగా శనివారం నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలు మరియు వేడుకలు భక్తి, శాంతి, సామరస్య వాతావరణంలో ఘనంగా జరిగాయి. ఈ పవిత్ర కార్యక్రమంలో ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరై ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ రంజాన్ మాసం అనేది ఆత్మశుద్ధి, నియమ నిష్ట, దైవభక్తి, సహనం, దానధర్మాల మహత్తును చాటి చెప్పే పవిత్రమైన కాలమని పేర్కొన్నారు. నెల పొడవునా భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు పాటించి, ప్రార్థనలు నిర్వహించి, అల్లాహ్ కృపాకటాక్షాలతో ఈ పవిత్ర మాసాన్ని విజయవంతంగా ముగించుకొని రంజాన్ పర్వదినాన్ని ఆనందోత్సాహాల మధ్య జరుపుకుంటున్న ప్రతి ముస్లిం సహోదర సహోదరీమణులకు తన హృదయపూర్వక శుభాభినందనలు తెలిపారు. రంజాన్ పండుగ మన సమాజానికి ఐక్యత, సోదరభావం, పరస్పర గౌరవం, మానవతా విలువలను గుర్తు చేసే మహత్తర పర్వదినమని ఆయన అన్నారు. మతాలు వేరు అయినప్పటికీ మనందరి లక్ష్యం శాంతి, ప్రేమ, సేవ, సహకారం అనే ఉన్నత విలువలే కావాలని, ఈ పవిత్ర పండుగ సమాజంలో సామరస్యాన్ని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. అలాగే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం మైనారిటీల సంక్షేమం కోసం పలు సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు పదివేల మంది ఇమామ్‌లు, మోజాన్‌లకు గౌరవ వేతనాల రూపంలో రూ.45 కోట్లు విడుదల చేయడం మైనారిటీల పట్ల ప్రభుత్వానికున్న చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. మైనారిటీల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, వారికి అవసరమైన సహకారం అందించేందుకు కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రతి వర్గానికీ సమాన న్యాయం చేయడం, అందరికీ అభివృద్ధి ఫలాలు చేరేలా పాలన సాగించడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి, సుభిక్షం, సోదరభావం నెలకొనేలా ప్రతి పండుగను ప్రజలందరూ కలిసికట్టుగా జరుపుకోవడం ఆనందదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, పార్టీ నాయకులు, అభిమానులు మరియు పెద్ద సంఖ్యలో ముస్లిం సోదర సోదరీమణులు పాల్గొన్నారు.

# తమిళనాడు బోట్ల విడుదల విషయంలో నాకు సంబంధం లేదు

## తనపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ఎవరు నమ్మవద్దు .... రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు





కావలి ఆర్ సి ఇంచార్జ్ పెన్ పవర్ మార్చ్ 21 జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ లో ఉన్న తమిళనాడుకు చెందిన నాలుగు మర బోట్లను తీసుకెళ్లిన ఘటనకు, తనకు ఎలాంటి సంబంధం లేదని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు స్పష్టం చేశారు. బోట్లను విడిపించడానికి తాను ఎవరికీ ఫోన్ చేయలేదని, తనపై చేస్తున్న దుష్ప్రచారం ఎవరు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రజా సేవలో నిమగ్నమైన నాపై ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేయడం దుర్మార్గమని అన్నారు. మత్స్యకారులు కొన్ని సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యకు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ను కోరుతున్నట్లు తెలిపారు. ఈ మేరకు అయిన తనపై వస్తున్న ఆరోపణలపై వీడియో రిలీజ్ చేశారు.

# గాంధేయవాది, మాజీ ఎమ్మెల్యే టిసి రాజన్ నిష్క్రమణ..

## 108ఏళ్ల కురువృద్ధులు ఇకలేరు

పలమనేరు,పెన్ పవర్, మార్చి 21, నాటి పాత తరం రాజకీయ నాయకుడు, విలువలకి ప్రతినిధి ఠానేదార్ చిన్న రాజన్ (టిసి.రాజన్) వెళ్లిపోయారు.నూరేళ్లకి పైగా నిండు జీవితం జీవించి వృద్ధాప్య సమస్యలతో మార్చి 20,శుక్రవారం స్వర్గస్తులయ్యారు. శనివారం పలమనేరు పత్తికొండ రైస్ మిల్లు దగ్గర అంత్యక్రియలు జరిగాయి. మనం చిన్నతనంలో చూసిన మొదటి రాజకీయ నాయకుడు ఆయన.పలమనేరు మాజీ ఎమ్మెల్యే (1967)గా చేసారు. ఆయన సతీమణి భద్రాంభ అనంత పురంలో జడ్జిగా పని చేసారు.వాళ్ల పెద్ద పిల్లలు మేఘరాజ్, మేఘనాథ్ (కవలలు) నాకు బాల్య స్నేహితులు.చిన్న కొడుకు సంజయ్, రెండేళ్ల క్రితం భార్యతో కలిసి కోయంబత్తూరు నుంచి వస్తూ వుంటే రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.ఆయన కూతురు సునీత బెంగళూరులో వుంటున్నారు. రాజన్ మాట,మనిషి రెండూ ఒకటే.ఏది చెప్పారో,ఏది నమ్మారో జీవితమంతా అదే ఆచరించారు. ఎన్జీ.రంగా అనుచరుడు స్వాతంత్ర్య సమరయోధుడు, జైలుకెళ్లి శిక్షని అనుభవించారు. 1967లో పలమనేరు నుంచి శాసనసభ్యుడిగా స్వతంత్ర పార్టీ తరపున గెలుపొందారు.

పింఛన్ వద్దన్న నాయకుడు టి.సి.రాజన్

కోట్లకి పడగలెత్తిన వాళ్లు కూడా మాజీలుగా పింఛన్ తీసుకోవడం చూస్తున్నాం.కానీ అసెంబ్లీలో పింఛన్ బిల్లుని వ్యతిరేకించిన మొదటి వ్యక్తి రాజన్. ఎమ్మెల్యేలు వున్నది ప్రజాసేవ చేయడానికే గానీ,ప్రభుత్వం నుంచి సౌకర్యాలు పొందడానికి కాదు అని అన్నారు. ఎమ్మెల్యేలకి బంజారహిల్స్‌లో ఇచ్చిన స్థలాన్ని కూడా నిరాకరించారు. స్వాతంత్ర సమరయోధుల పేరుతో ఇచ్చే భూమిని కూడా తిరస్కరించారు. రాజకీయాల్లోకి వచ్చింది ప్రజల కోసమే తప్ప, ఆస్తుల కోసం కాదని ఆయన సిద్ధాంతం. చివరి వరకూ నిరాడంబరంగా జీవించారు. ఆయన ఇంటికి వెళ్లినపుడు తెల్లటి ఖద్దరు బట్టల్లో కనిపించేవావాళ్లు. గాంధీ ఆయనకి ఆదర్శం.నౌకర్లు, అనుచరుల హంగామా గిట్టదు.ఇంట్లో ఏవో పుస్తకాలు సర్దుతూ, చదువుకుంటూ వుండేవాళ్ల.అహం అనే పదమే ఆయనకి తెలియదు.పిల్లలతో చిన్నపిల్లాడిలాగే మాట్లాడేవాళ్లు.

ఆయన సతీమణి భద్రాంభ కోర్టులో జడ్జి, ఇంట్లో ఒక తల్లి

అతిథులని ఆదరించడం,పిల్లలతో కబుర్లు చెప్పుకోవడం ఆమెకి ఇష్టం. పదిహేనేళ్ల క్రితం ఆమె అనారోగ్యంతో మరణించారు.ఈ బాధని రాజన్ తట్టుకున్నారు.రెండేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో కొడుకు,కోడలు చనిపోయినపుడు ఆయన చూపిన



మనోనిబ్బరం అందరినీ ఆశ్చర్యపరిచింది. జీవితంలోని కష్టనష్టాలని యధాతథంగా స్వీకరించిన వ్యక్తి టి.సి.రాజన్.

ఆయన జ్ఞాపకశక్తి ఎంతో అమోఘం

ఎప్పుడు కలిసినా పేరు పెట్టి పిలిచేవాళ్లు.

రాజకీయ విషయాలు అనర్గళంగా మాట్లాడేవాళ్లు.ప్రజా సమస్యల గురించి ఏదో ఒక వ్యాసం రాసేవాళ్లు. దిగజారిపోతున్న రాజకీయాల గురించి బాధపడేవాళ్లు. 108 ఏళ్ల వయసులో కూడా చేతికర్ర ఆసరా లేకుండా జీవించారు. ఇవ్వడమే తప్ప ఆశించడం తెలియని మహా మనిషి.ఆయన నిష్క్రమణతో రాజకీయాల్లో గాంధీశకం అంతరించి నట్టేనని చెప్పకనే చెప్పవచ్చు.(ఆయన మిత్రుని జ్ఞాపకాల నుండీ) జోహార్ టి.సి.రాజన్...జోహార్

# కోలాహలంగా రంజాన్ వేడుకలు





బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ మార్చి 21. భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనల నెలరోజుల పాటు ఉపవాస దీక్ష చేసిన ముస్లిం సోదరులు శుక్రవారం నెలవంక కనిపించడంతో శనివారం దీక్ష లను నిర్మించారు ఈ సందర్భంగా శనివారం బుచ్చిరెడ్డిపాలెం మండలంలోని మసీదులలో ప్రత్యేక ప్రార్థనలను నమాజులను చేశారు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలియజేసుకోవడం జరిగింది. ముఖ్యంగా వివిధ వర్గాలకు చెందిన వారు ముస్లింలకు రంజాన్ సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేశారు

# మహాలక్ష్మి అవతారంలో గంటావూరు శ్రీతిరుపతి గంగమ్మ

పలమనేరు,పెన్ పవర్, మార్చి 21, అత్యంత మహిమాన్విత దైవం పలమనేరు పట్టణ పరిధిలోని గంటావూరు శ్రీతిరుపతి గంగమ్మతల్లి అని ఆలయ చైర్మన్ డాక్టర్ మురుగన్ అన్నారు.తెలుగుప్రజల నూతన సంవత్సరం ఉగాది మరియు శుక్రవారం సందర్భంగా మున్సిపల్ పరిధిలోని గంటాఊరు నందు వెలసిన శ్రీతిరుపతి గంగమ్మ దేవాలయంలో ఉదయం గంగమ్మ, మారెమ్మ అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు.అలాగే ఎంతో ప్రత్యేకమైన పుష్పాలు,వివిధ పట్టువస్త్రాలు,విభిన్నమైన శ్రీలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు కన్నులపండువగా అమ్మవారిని తీర్చిదిద్దారు.ఆలయంలోని ఢమరుకనాదంతో కీర్తిస్తూ ప్రత్యేక పూజాకార్యక్రమం నిర్వహించారు.పూజల అనంతరం అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహించి,చివరగా అమ్మవారికి జ్వాలా దీపహారతి నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.అదేవిధంగా అమ్మవారికి ఎంతో ఇష్టమైన శుక్రవారం ఇరువురు అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి దూపదీపనైవేద్యాలతో విశేషమైన పూజలను, అలాగే ఉగాది పండుగ రోజు మన తెలుగు ప్రజల సంస్కృతి సంప్రదాయాలను ఇనుమడించే విధంగా పంచాంగ శ్రవణం కూడా ఆలయ ప్రధాన అర్చకులు లలిత్ రామ్ నిర్వహించారు.

రెండు రోజులు నిరంతారయంగా అన్నదానం

ఈ రెండు రోజులు ఆలయ చైర్మన్ డాక్టర్ మురుగన్ ఆధ్వర్యంలో ఉదయం 8గంటల నుండి రాత్రి 9గంటల వరకు వేలాదిమంది భక్తులకు నిరంతరాయంగా అన్నదానం



నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..నెలలో ప్రతి మంగళ,శుక్రవారం అలాగే పౌర్ణమి రోజున మరియు విశేష రోజుల్లో అమ్మవారికి పూజలు నిర్వహించి,భక్తులకు అన్నదానం నిర్వహిస్తామని,ఈ మహత్కార్యంలో భక్తులందరూ పాల్గొని,ఆలయంలో నిర్వహించే కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావాలని ఆయన కోరారు.

# ఈద్గాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు

కడప :పెన్ పవర్, మార్చి, 21: వైఎస్సార్ కడప జిల్లా వ్యాప్తంగా రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈద్గాల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే ఈ జిల్లాలో, పండుగ వేళ ముస్లిం సోదరులకు పోలీస్ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. ఈద్గాల వద్ద రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎక్కడా అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో రాకపోకలకు ఆటంకం లేకుండా పోలీసు యంత్రాంగం నిరంతరం నిఘా ఉంచుతూ, శాంతియుత వాతావరణంలో పండుగ జరిగేలా అప్రమత్తంగా వ్యవహరిస్తోంది.

# ఘనంగా ప్రపంచ కవితా దినోత్సవం



బుచ్చిరెడ్డిపాలెం పెన్ పవర్ మార్చి 21. పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ప్రొద్దుటూరు గాంధీనగర్ లోని బి.సి.ప్రజా చైతన్య సమాఖ్య నందు ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా కవిసమ్మేళనం జరిగింది. ఈసందర్భంగా ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన ప్రముఖ కవి జింకా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ భాషా భిన్నత్వాన్ని కవిత్వం ద్వారా ప్రదర్శించేలా, మృత భాషలుగా మారుతున్న భాషల్ని ప్రజల్లోకి పరివ్యాప్తం చేయడం ద్వారా పునరుజ్జీవింప చేయడం ఈ దినోత్సవం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. నెల్లూరు నుంచి విచ్చేసిన పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కె.మురళీమోహన్ రాజు మాట్లాడుతూ సమాజ హితం కోరేది సాహిత్యం. అటువంటి సాహిత్యాన్ని అందించేది కవులు. కవులు ముందు చూపుతో సమాజ అభివృద్ధిలో ప్రముఖ పాత్ర పోషిస్తూ ఉంటారని వివరించారు. ఈకార్యక్రమంలో కవులు కొత్తపల్లి శ్రీను, బొర్రా రామాంజనేయులు, పల్లా రామారావు, కాశీవరపు వెంకటసుబ్బయ్య, కంభం పామిలేటి, రచయితలు తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా వద్ద ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపిన షేక్ సిరాజ్ భాష



శ్రీకాళహస్తి, పెన్ పవర్, మార్చి, 21 : పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా ఈద్గా వద్ద వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, తిరుపతి జిల్లా మాజీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్ షేక్ సిరాజ్ భాష ముస్లిం సోదర సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఈద్ ప్రార్థనల్లో పాల్గొని, సమాజ శాంతి, సౌహార్ద్రం, సుఖశాంతులు నెలకొనాలని ఆకాంక్షించారు. రంజాన్ మాసం మనుషుల్లో ఆత్మపరిశీలన, సహనం, దాతృత్వం వంటి విలువలను పెంపొందించే పవిత్రమైన కాలమని ఆయన పేర్కొన్నారు. సమాజంలో అన్నివర్గాల ప్రజలు ఐక్యంగా, సోదరభావంతో జీవించాలనే సందేశాన్ని ఈ పండుగ అందిస్తుందని అన్నారు. అలాగే పేదలకు సహాయం చేయడం, అవసరమైన వారికి తోడ్పాటు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య సమరయోధులు టి.సి.రాజన్ జీవితం అందరికీ ఆదర్శనీయం పి.పి.ఎస్.సభ్యులు



పలమనేరు,పెన్ పవర్, మార్చి 21, స్వాతంత్ర్య సమరయోధులు టి.సి.రాజన్ జీవితం అందరికీ ఆదర్శనీయమని పి.పి.ఎస్.సభ్యులు అన్నారు.స్వాతంత్ర్య సమర యోధులు, శతాధిక వయస్కులు పలమనేరు మాజీ శాసనసభ్యులు టి.సి. రాజన్ మరణం పట్ల పలమనేరు పరిరక్షణ సమితి (పి.పి.ఎస్.) తీవ్రసంతాపం వ్యక్తం చేసింది.ఈ సందర్భంగా పి.పి.ఎస్.అధ్యక్షులు టి.ఎల్.నరసింహులు, ఏపీ ఎన్జీజీఓ సంఘం అధ్యక్షులు ఆనందబాబు, పి.పి.ఎస్.కార్యదర్శి నారాయణ మరియు కార్యవర్గ సభ్యులు ఆయన పార్థివదేహానికి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆనందబాబు మాట్లాడుతూ..దేశసేవ చేయడానికి అవకాశం భగవంతుడు కొద్ది మందికే ఇస్తాడని, అలాంటి అదృష్టవంతుల్లో మన పలమనేరు వాసి టి.సి. రాజన్ ఒకరని అన్నారు.వందేళ్లకు పైగా ఆరోగ్యంగా జీవించడం ఆయన క్రమశిక్షణతో కూడిన జీవన విధానానికి నిదర్శనమని,అందుకే ఆయన జీవితం ఆదర్శనీయమని పేర్కొన్నారు.ఇందులో విజయకుమార్ రెడ్డి, పొన్ముడి,వెంకట్, రామచంద్ర,శ్రీపురం సీతారామయ్య, వీరభద్రగౌడు, దొరస్వామి, విజయకుమార్, రెడ్డప్ప,సురేంద్ర, వెంకటేశ్వర్లు,శేఖర్ తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

# కడపలో నైట్ పెట్రోలింగ్ ముమ్మరం : ఎస్పీ

కడప: పెన్ పవర్, మార్చి, 21: కడప జిల్లాలో నేరాల నియంత్రణే లక్ష్యంగా పోలీసులు నైట్ పెట్రోలింగ్ ముమ్మరం చేసినట్లు ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. తాళాలు వేసిన ఇళ్లు, దేవాలయాలు, ఏటీఎంలు వ్యాపార సముదాయాల వద్ద చోరీలు జరగకుండా క్షేత్రస్థాయి సిబ్బంది నుండి డీఎస్పీల వరకు రాత్రివేళ గస్తీని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. అనుమానిత వ్యక్తులు, వాహనాలను నిశితంగా తనిఖీ చేయడంతో పాటు లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలు సాగకుండా ఆధార్ కార్డులను పరిశీలిస్తూ ప్రత్యేక నిఘా ఉంచారు. ముఖ్యంగా పాత నేరస్తుల కదలికలపై మొబైల్ చెక్ డివైజ్ ద్వారా నిఘా పెంచుతూ, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై మరియు అకారణంగా తిరిగే ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. రహదారి ప్రమాదాల నివారణకు తెల్లవారుజామున వాహనదారుల కోసం 'స్టాప్ అండ్ వాష్' కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందిస్తున్నారు.

# తిరుపతిలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నూతన బ్లడ్ బ్యాంక్ ప్రారంభం



శ్రీకాళహస్తి, పెన్ పవర్ ,మార్చి ,21 : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో తిరుపతిలో నూతనంగా ఏర్పాటు చేసిన బ్లడ్ బ్యాంకును రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ గారు శనివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో తిరుపతి ఎమ్మెల్యే శ్రీ ఆరని శ్రీనివాసులు, జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు శ్రీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అలాగే రెడ్ క్రాస్ తిరుపతి జిల్లా చైర్మన్ డా. డి. శ్రీహరి రావు, వైస్ చైర్మన్ డా. గుడ్లూరు మయూర్, కార్యదర్శి జి. ప్రతీత్, ఖజానాదారు జి.వి. సుబ్బారావు తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవా దృక్పథంతో ప్రజలకు విలువైన సేవలు అందిస్తున్న సంస్థ అని పేర్కొన్నారు. తిరుపతిలో నూతన బ్లడ్ బ్యాంకు ప్రారంభం కావడం ద్వారా అత్యవసర సమయాల్లో రక్త అవసరాలను తీర్చడంలో ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన రెడ్ క్రాస్ సొసైటీ కార్యవర్గ సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సభ్యులు మణి శ్రీనివాస్, కృష్ణ కుమార్, సుధీర్, శివకుమార్, సుబ్రహ్మణ్యం రెడ్డి, గుణశేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

# జశ్వంత్ కుమార్ జన్మదినం సందర్భంగా మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



గూడూరు పట్టణంలోని 1వ వార్డులో ఎమ్మెల్యే డా. పాశిం సునీల్ కుమార్ తనయుడు డా. పాశిం జశ్వంత్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమం గోను శివకుమార్ సూచనల మేరకు ఎమ్మెల్యే తమ్ముడు పాశిం సురేష్ కుమార్ చేతుల మీదుగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యువనాయకుడు జశ్వంత్ కుమార్ జీవితంలో ఉన్నత శిఖరాలకు ఎదగాలని, దేవుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు అడపాల శివకుమార్,26వ బూత్ ఇంచార్జ్ అడపాల అనీష్ కుమార్ (రాము)లను అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ నాయకులు, మాజీ కౌన్సిలర్లు నిమ్మకాయల నరసింహులు నాయుడు, గుండాల భారతమ్మ, 1వ వార్డు సీనియర్ నాయకులు కందిపాటి రత్నయ్య, కస్తూరి ధనమ్మ, పల్లం ప్రసాద్, పందిట్టి వెంకటేష్, పాలెటి రాజా, అరవ పార్వతయ్యతో పాటు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# గూడూరులో ఘనంగా ఈదుల్ ఫితర్ వేడుకలు





గూడూరు, పెన్ పవర్, మార్చి,21: పవిత్ర రంజాన్ మాసం ముగింపును సూచిస్తూ ఈదుల్ ఫితర్ పండుగను గూడూరులో ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ప్రత్యేక నమాజులు ఈద్గాహ్ మరియు మసీదుల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నమాజ్ అనంతరం ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని "ఈద్ ముబారక్" అంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు కొత్త దుస్తులు ధరించి ఆనందంగా పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మత పెద్దలు సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ప్రార్థనలు చేశారు. పేదలకు జకాత్, ఫిత్రా రూపంలో సహాయం అందిస్తూ మానవతా విలువలను చాటిచెప్పారు.

# కార్పొరేషన్ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ బాధ్యతలు

గుంటూరు. పెన్ పవర్, మార్చి, 21: గుంటూరు నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారిగా జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారీయా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులతో సమీక్షించారు. నగరంలోని ప్రధాన అంతర్గత డ్రెయిన్లలో పూడికతీత పనులను వర్షాకాలం లోపు నూరుశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. పీకల వాగు, ఇతరఅవుట్ ఫాల్ డ్రెన్ల ఆక్రమణలపై వారంలో సర్వే చేసి పూర్తి స్థాయి నివేదిక ఇవ్వాలన్నారు. మేజర్, మీడియం డ్రెయిన్లలో మేష్‌లు ఏర్పాటు చేసి వాటివద్ద చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. గతేడాది నీటి ఎద్దడి ఎదుర్కొన్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ట్యాంకర్లను అందుబాటులో ఉంచాలని, మరమ్మతులకు గురైన బోర్లను వినియోగంలోకి తేవాలని చెప్పారు.వీధి కుక్కల సమస్యలపై అడిగి తెలుసుకొని, ఎబిసి సెంటర్‌ను పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రోడ్లపైగుంతలను వెంటనే పూడ్పించాలని,ప్రధాన రహదారుల్లో సమస్యాత్మక ప్రాంతా లను గుర్తించిఅక్కడున్న వీధి వ్యాపారులను వెండింగ్ జోన్లకు తరలించడానికి ప్రణాళిక సిద్ధం చేయాలని అన్నారు. పన్ను వసూళ్ల డిమాండ్ రూ.350 కోట్లుకాగా ఇప్పటికి రూ.120 కోట్లు వసూలైందని, నెలాఖరుకు మొత్తం వసులు చేయాలని సూచించారు. సమీక్షలోకమిషనర్ కె.మయూర్అశోక్, అదనపు కమిషనర్ సిహెచ్. ఓబులేసు, డిప్యూటీకమిషనర్లుబి.శ్రీనివాసరావు,సిహెచ్.శ్రీనివాస్, జి.సాంబశివరావు, సిపిరాంబాబు ,సిఎంఒహెచ్‌డాక్టర్ శాంతికళ, పాల్గొన్నారు.

# టీడీపీ సీనియర్ నాయకుడు ఈశ్వర్ రెడ్డిని పరామర్శించిన బొజ్జల బృందమ్మ

శ్రీకాళహస్తి,,పెన్ పవర్,మార్చి,21: శ్రీకాళహస్తి మండలం ఎంపేడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శ్రీ ఈశ్వర్ రెడ్డి ఇటీవల అనారోగ్యానికి గురై తిరుపతిలోని బర్డ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా బొజ్జల బృందమ్మ ఆసుపత్రికి వెళ్లి ఆయనను మర్యాద పూర్వకంగా పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఈశ్వర్ రెడ్డి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పి, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ



పరామర్శ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని ఈశ్వర్ రెడ్డి గారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు.

# ధాన్యం సేకరణపై ఆకస్మిక తనిఖీ చేపట్టిన ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి





విడవలూరు పెన్ పవర్ మార్చి 21. రైతుల సమస్యలపై జేసీతో ఫోన్లో మాట్లాడిన ప్రశాంతమ్మ గోనె సంచులు, రవాణాకు లారీలను అందుబాటులో ఉండేలా చూడాలి ఎక్కడైనా ఇబ్బందులు వస్తే నా దృష్టికి తీసుకురండి కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతమ్మ కోవూరు నియోజకవర్గంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు, నాయకులు తగిన చర్యలు తీసుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం విడవలూరు మండలంలోని వావిళ్ల రోడ్డులో ఉన్న ధాన్యం సేకరిస్తున్న ప్రాంతాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైతుల సమస్యలపై వెంటనే స్పందించిన ఆమె.. ఈ సందర్భంగా రైతులు, రైస్ మిల్లర్లతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. రైతులకు లారీలు, గోనె సంచులు వంటి సదుపాయాల లోపం లేకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు. ధాన్యం కొలతలు, సేకరణ ప్రక్రియ పారదర్శకంగా ఉండాలని ఆదేశించారు. రైతులకు అధికారులు, ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. రైతుల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.ఆకస్మిక తనిఖీల్లో రైతులు ఆమె దృష్టికి తెచ్చిన సమస్యలపై అక్కడికక్కడే జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్లుతో ఫోన్‌లో మాట్లాడి, తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. రైతులకు అవసరమైన గోనె సంచులు అందుబాటులో ఉంచాలని అన్నారు.

ఎవరైనా అవకతవకలకు పాల్పడితే వెంటనే తనకు సమాచారం ఇవ్వాలని ఎమ్మెల్యే రైతులు, సొసైటీలు, అధికారులను కోరారు. రైస్ మిల్లర్లు, రైతుల మధ్య సమన్వయం కల్పించడంలో సొసైటీలు, అధికారులు బాధ్యతగా పనిచేయాలని తెలిపారు.

# ఈద్గా నూర్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా.పాశిం సునీల్ కుమార్





గూడూరు, పెన్ పవర్, మార్చి,21: పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరుల కోసం 1.15 ఎకరాల స్థలంలో నూతనంగా కేటాయించిన ఈద్గా నూర్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో గూడూరు నియోజకవర్గ శాసన సభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పాల్గొన్నారు. ప్రారంభోత్సవం అనంతరం ఆయన ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రంజాన్ పండుగ సోదరభావం, ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని, ప్రజలు శాంతి, సామరస్యంతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముస్లింలకు మంత్రి శుభాకాంక్షలు





నెల్లూరు పెన్ పవర్ మార్చి 21. రంజాన్ పండుగ సందర్భంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గం పరిధిలోని బారాషాహిద్ దర్గా నందు రాష్ట్ర మంత్రివర్యులు పొంగూరు నారాయణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ డిప్యూటీ మేయర్ పోలుబోయిన రూప్ కుమార్ యాదవ్ మరియు ముస్లిం మత పెద్దలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్న టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి.రాష్ట్రంలో ఉన్న ప్రతి ముస్లిం సోదరీ సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో బారాషాహిద్ దర్గాలో అనేక అభివృద్ధి పనులు చేశాం, నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని ఈద్గా మరియు బారాషహిద్ దర్గా ముఖద్వారాలను నిర్మించడం మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర ముఖ్య మంత్రి బారాషహీద్ దర్గా అభివృద్ధి కోసం మొదటి దశలో 9.8 కోట్ల రూపాయలు మంజూరు చేశారు. అతి త్వరలో ఆ పనులు ప్రారంభిస్తాం.మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ ముబారక్. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులందరూ ప్రపంచంలో యుద్ధాలు జరుగుతున్న వేళ ప్రపంచ శాంతి కోసం ప్రార్ధనలు చేశాం.రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ కూటమి ప్రభుత్వం ముస్లిం సోదరులకు ఎంతగానో అండగా ఉంది. ఈద్గా నందు ప్రత్యేక ప్రార్థనలను చేసుకునేందుకు ప్రస్తుతం తాత్కాలిక ఏర్పాట్లతో జరుగుతున్నాయి, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మంత్రి పొంగూరు నారాయణ నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి సహకారంతో శాశ్వత పరిష్కారం దిశగా 9.8 కోట్ల రూపాయలతో అద్భుతమైన మసీదు నిర్మించనున్నాము. రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ బారాషహిద్ దర్గా ముఖద్వారాలను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి నిర్మించారు. ముస్లిం సమాజానికి అన్ని విధాలా అందిస్తున్న మంత్రి పొంగూరు నారాయణ నెల్లూరు రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి

నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ప్రతి చిన్న పనిని దగ్గర ఉండి చూస్తున్న కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ ముస్లిం సోదర సోదరీమణులందరికీ రంజాన్ శుభాకాంక్షలు. పవిత్ర రంజాన్ మాసంలో నిష్టాగరిష్టలతో ఉపవాస దీక్షలు ఉండి, ప్రపంచ శాంతి కోసం దువా చేసిన ప్రతి ముస్లిం సోదర సోదరీమణులకు ఈద్ ముబారక్. టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఈద్గా బారాషహిద్ దర్గా ఉండటం.టీడీపీ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి

# 26 తిరుమలలో ఘనంగా నారా దేవాన్ష్ జన్మదిన వేడుక

**శ్రీవారిని దర్శించుకున్న నారా కుటుంబం**
**అన్నప్రసాద వితరణకు రూ.44 లక్షల విరాళం**
**భక్తులకు స్వయంగా అల్పాహారాన్ని వడ్డించిన కుటుంబ సభ్యులు**







తిరుమల: పెన్ పవర్, మార్చి, 21: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గారి మనవడు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కుమారుడు నారా దేవాన్ష్ జన్మదిన వేడుక తిరుమలలో ఘనంగా జరిగింది. నారా దేవాన్ష్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కుటుంబం శనివారం ఉదయం కలియుగ ప్రత్యక్షదైవం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. సీఎం చంద్రబాబునాయుడు, భువనేశ్వరి దంపతులు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, కుమారుడు నారా దేవాన్ష్ తిరుమల శ్రీవారిని దర్శించుకుని స్వామివారి ఆశీస్సులు పొందారు. శ్రీవారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వైకుంఠం క్యూకాంప్లెక్స్ ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్, కుటుంబ సభ్యులకు ఆలయ అర్చకులు, టీటీడీ అధికారులు ఘనస్వాగతం పలికారు. దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో పండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద క్యూ కాంప్లెక్స్ లో భక్తులకు అన్నప్రసాదం వితరణ చేశారు. అన్నప్రసాద వితరణ కోసం ఒక్కరోజు వ్యయం అయ్యే మొత్తం రూ.44 లక్షలను శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్ట్ కు నారా కుటుంబం విరాళంగా అందజేసింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, భువనేశ్వరి, మంత్రి నారా లోకేష్, నారా దేవాన్ష్ భక్తులకు స్వయంగా అల్పాహారం వడ్డించారు. అనంతరం అందరూ కలిసి స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి అనగాని సత్యప్రసాద్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో ఎం.రవిచంద్రతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# వైయస్ విజయమ్మ పత్రికలకు ప్రకటన విడుదల చేయడం జగన్ ను దెబ్బతీసేందుకే...

**వైయస్ జగన్ ను జైలుకు పంపేందుకు వెనుకాడని షర్మిలమ్మ, సునీతమ్మ లు చెల్లెలు పదానికే కళంకం.**
**విమలమ్మకు వాటా ఇవ్వని మీరు... షర్మిలమ్మకు వాటా అడగడం ఏమిటి విజయమ్మ తల్లీ.**
**వైయస్ అవినాష్ పై బీటెక్ వ్యాఖ్యలు సిగ్గుచేటు.**
**కూటమి పద్మవ్యూహంలో ఇరుక్కోవడానికి జగన్ అభిమన్యుడు కాదు అర్జునుడు.**
**తీవ్ర స్థాయిలో విలుచుకుపడ్డ వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి రెడ్యశీ వెంకటసుబ్బారెడ్డి.**

కడప : పెన్ పవర్, మార్చి, 21: వైయస్ జగన్ తల్లిగా, జగన్ తో మాట్లాడే చనువు, బాధ్యత ఉన్నప్పటికీ మాట్లాడకుండా వైయస్ విజయమ్మ కుమారుడి ని దెబ్బతీసేందుకు ... కుమార్తె షర్మిలమ్మ ను రక్షించడంలో భాగంగా రాష్ట్ర ప్రజలను నమ్మించేందుకు విజయమ్మ స్టేట్ మెంట్ కు నోటరీ చేయించి విడుదల చేయడం తల్లిగా మీకు ఇది తగునా? ఇది జగన్ ను దెబ్బ తీసే కుట్ర కాదా ? అని వైయస్ఆర్సీపీ రాష్ట్ర కార్యదర్శి, కమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు రెడ్యశీ వెంకటసుబ్బారెడ్డి తీవ్ర ఆవేదన, ఆందోళన వ్యక్తపరిచారు. కడప నగరంలోని వైఎస్ఆర్ సీపీ జిల్లా కార్యాలయంలో శనివారం రెడ్యశీ విలేకరులతో మాట్లాడుతూ కోట్లాదిమంది మాలాంటి అభిమానులు అభిమానించే, ఆరాధించే మా అందరి అభిమాన నేత వైయస్ జగన్ ను శత్రువు కంటే మిన్నగా విమర్శించడం ఏమిటని? ఆయన నిలదీశారు.సరస్వతి పవర్ ప్రాజెక్టుకు సంబంధించి కొన్ని షేర్లు అటాచ్మెంట్ లో ఉంది కాబట్టి షేర్ల బదలాయింపు జరగదని తెలిసీ షర్మిలమ్మ చట్ట విరుద్ధంగా, మోసపూరితంగా ఆ షేర్లను బదిలీ చేయించుకున్నారన్నారు. అలా చేస్తే వైయస్ జగన్ బెయిల్ రద్దయి జగన్ జైలుకు పోవాలనే దుష్ట బుద్ధితో చంద్రబాబుతో కుమ్మక్కై షర్మిలమ్మ ఇలా ప్రవర్తించారని ఇలాంటి చెల్లెలు చెల్లెలు పదానికే కళంకం కాదా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు. వైయస్ జగన్, వైయస్ భారతమ్మలను వివేకా కేసులో ముద్దాయిలుగా చేర్చాలని కుట్రపన్ని కూటమినేతలతో లాలూచీపడి సుప్రీంకోర్టులో సునీతమ్మ కేసు వేసిందని ఇలాంటి చెల్లెలు చెల్లెలు పదానికే కళంకం కాదా? అని ఆయన నిలదీశారు . చరిత్రలో షర్మిలమ్మ, సునీతమ్మ లాంటి చెల్లెలు పగవానికి కూడా ఉండకూడదని తెలుగింటి ఆడపడుచులంతా ముక్తకంఠంతో భావిస్తున్నారని,అన్న క్షేమాన్ని కోరాల్సిన చెల్లెళ్ళు అన్న పతనాన్ని కోరడం అందునా చంద్రబాబు డైరెక్షన్లో నడవడం పై ఆయన మండిపడ్డారు. దివంగత ముఖ్యమంత్రి డా॥వైయస్ రాజశేఖర్ రెడ్డి కి ఉన్న ఏకైక చెల్లెలు విమలమ్మకు మీరు వాటా పంచి ఇచ్చారా? మీరు ఆడపడుచు విమలమ్మకు వాటా పంచనప్పుడు షర్మిలమ్మకు వాటా ను జగన్ తో ఎలా అడుగుతారు?విజయమ్మ తల్లీ దీనిపై రాష్ట్ర ప్రజలకు జవాబు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్ పై పులివెందుల టిడిపి ఇన్చార్జి బీటెక్ రవి మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఆయన నిశితంగా విమర్శించారు. వివేక హత్య జరిగిన విషయం వివేక




బావమరిది నర్రెడ్డి శివప్రకాశ్ రెడ్డి చెప్పే వరకు వైయస్ అవినాష్ కు తెలియనే తెలియదు అన్నారు.వివేక హత్యపై వైయస్ అవినాష్ పైనే చెప్పాలని సునీతమ్మ, నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి లు వివేకా పిఏ మూలి వెంకట కృష్ణారెడ్డి పై ఎందుకు ఒత్తిడి చేశారు?అవినాష్ ను ముద్దాయిని చేయకపోతే మీరు జైలుకు వెళతారని మూలి వెంకటకృష్ణారెడ్డి వద్ద నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి తో సునీతమ్మ ఎందుకు చెప్పారన్నారు.అలాగే... వివేక హత్య వద్ద ఉన్న లెటర్ ను పక్కన పెట్టమని మూలి కృష్ణారెడ్డి పై నర్రెడ్డి రాజశేఖర్ రెడ్డి ఎందుకు ఒత్తిడి చేశానన్నారు. పై విషయాలపై దమ్ముంటే బీటెక్ రవి సమాధానం చెప్పాలని ఆయన సవాల్ విసిరారు. వైఎస్ జగన్ పై కూటమి ప్రభుత్వంతోపాటు దానికి బద్ధ వ్యతిరేకమైన కాంగ్రెస్ పార్టీ , సునీతమ్మ,షర్మిలమ్మ,విజయమ్మ అందరూ మూకుమ్మడిగా వారి స్వార్ధం కోసం కుట్రపనినా ఆ పద్మవ్యూహంలో ఇరుక్కోవడానికి జగన్ అభిమన్యుడు కాదని అందరినీ ఎదిరించే సత్తా గల అర్జునుడని పేర్కొన్నారు.ఎవరు ఎన్ని కుట్రలు చేసినా చివరకు నిజం నిలకడ మీద తెలుస్తుందని,తద్వారా జగన్ ను విజయం వరించి తీరుతుందని దీనికి ఎదురేలేదని రెడ్యశీ విశధీకరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సీపీ కమలాపురం,చెన్నూరు మండల అధ్యక్షులు సుధ ఉత్తమ రెడ్డి, జి ఎన్ భాస్కర్ రెడ్డి,చెన్నూరు మండల పరిషత్ అధ్యక్షుడు వైఎస్ఆర్సీపీ మండల నేత చీర్ల సురేష్ యాదవ్, వైఎస్ఆర్సీపీ నేత మున్నెల్లి వెంకట సుబ్బయ్య (చిన్న) లు పాల్గొన్నారు

# జాబ్ క్యాలెండర్ కాదు - మాయ క్యాలెండర్:- ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు పెద్దులపల్లి ప్రభాకర్

కడప పెన్ పవర్, మార్చి, 21: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసినది జాబ్ క్యాలెండర్ కాదని యువతను మోసగించే మాయ క్యాలెండర్ అని ఏఐవైఎఫ్ కడపజిల్లా అధ్యక్షులు పెద్దుల్లపల్లి ప్రభాకర్ విమర్శించారు.ఆయన మాట్లా డుతూ.యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ప్రతి జనవరి కి జాబ్ క్యాలెండర్ ప్రకటించి లక్షల ఉద్యోగాలు యువతకు ఇస్తామని నమ్మబలికి రెండు సంవత్సరాలుగా మోసం చేశారని అన్నారు. రాష్ట్ర యువతను ఊరించి ఊరించి ఉగాది పండుగకు పదివేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేస్తామని అది కూడా సంవత్సర కాలం అంతా చేయడం అంటే హాస్యాస్పదంగా ఉందని అన్నారు. నిరుద్యోగ భృతి వంటి కీలక అంశాలను విస్మరించడం వల్ల యువతలో ప్రభుత్వంపై నమ్మకం సడలిందని ఆరోపించారు. ఎన్నికలకు ముందు నిరుద్యోగ భృతి అమలు చేస్తామని, ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఈ అంశంపై స్పష్టమైన వైఖరీ అవలించకపోవడం, తీరా 10,000 ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేస్తామని ఒక మాయ క్యాలెండర్ ప్రభుత్వం విడుదల చేయడంతో యువతలో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. లక్షలాది మంది నిరుద్యోగులు మెగా జాబ్ క్యాలెండర్ కోసం ఎదురు చూస్తుంటే వారి ఆశలను నీరుగారిచే విధంగా ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ ఉన్నదని అన్నారు. రాష్ట్ర యువతకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఎన్నో ఆకాంక్షలతో ఎదురుచూస్తున్న యువతకు నిరాశే మిగిలిందన్నారు.

ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు యువత సిద్దమని,



కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పిందని, ఇక రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెప్పేందు నిరుద్యోగ యువత సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఇది ముమ్మాటికి భావితరాలను వెనెక్కి నెట్టుతున్న ప్రభుత్వమని స్పష్టం చేశారు. నిరుద్యోగ సంఖ్య రోజురోజుకు పెరిగి బారమైతున్న సంగతి రాష్ట్ర ప్రభుత్వానికి ఎందుకు అర్థంకావడం లేదని ప్రశ్నించారు. సరైన సమయంలో ఉద్యోగాలు ఇవ్వని కారణంగానే రాష్ట్రంలో నిరుద్యోగుల సంఖ్య అధిక సంఖ్యలో పెరుగుతుందని అన్నారు.

# 50మధ్యాహ్న భోజన పథకంపై గరికపాటి వాఖ్యలు సిగ్గుచేటు.

**విద్యార్థులకి క్షమాపణలు చెప్పాలి.**
**ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు జాల సుమంత్, వీరపోగు రవి.**

కడప పెన్ పవర్, మార్చి, 21: గరికపాటి నరసింహారావు పేద పిల్లలకు అందించే మధ్యాహ్నభోజన పథకంపై అహంకారపు అక్కసు వెళ్ళగక్కడాన్ని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ ) కడప నగర కమిటీ తీవ్రంగా ఖండిస్తుంది. వాఖ్యలను వెనక్కి తీసుకుని, క్షమాపణ చెప్పాలని శనివారం విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జాల సుమంత్, వీరపోగు రవి అన్నారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....

ప్రవచనాల పేరుతో పిల్లలకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడటం అమానవీయం. పిల్లలు కేవలం కోడిగుడ్డు కోసమే బడికి వస్తున్నారని, చదువు "మిధ్య" అయిపోయిందని అనడం పేద విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే. మధ్యాహ్న భోజనం పిల్లలు బడికి వచ్చేందుకు, డ్రాపౌట్ తగ్గేందుకు దోహదపడిందని అనేక అంతర్జాతీయ అధ్యయనాలు చెబుతున్నాయి. విద్యార్థులను "శోభనం పెళ్లికొడుకు"తో పోల్చడం విద్యార్థి లోకాన్ని కించపరచడం. భారతదేశంలో 84% మంది తల్లులు, పిల్లలు పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. కోడిగుడ్డును దానిని "గాడిద గుడ్డు" అని సంబోధించడం ఆకలిని కించపరచడం. విద్యార్థులకు భోజనం, పుస్తకాలు, యూనిఫాం అందించడం ప్రభుత్వ బాధ్యత. దానిని "బిచ్చం" అని పిలవడం సిగ్గుచేటు. గరికపాటి వ్యాఖ్యలు కనీస "విజ్ఞత లేనివి", ఏనాడయిన కార్పోరేట్లకు ఇచ్చే లక్షల కోట్ల రాయితీల గురించి మాట్లాడని గరికపాటు పేద పిల్లలకు అందించే భోజనంపై విషం కక్కటం దుర్మార్గం. గరికపాటి వ్యాఖ్యలు వెంటనే వెనక్కి తీసుకోవాలి. పిల్లలను అవమానించిన గిరికపాటి నరసింహారవు క్షమాపణలు చెప్పాలి. ఎస్ఎఫ్ఐ కడప జిల్లా కమిటీ డిమాండ్ చేయడం జరిగింది లేనిపక్షంలో పెద్ద ఎత్తునఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని సందర్భంగా తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నగర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# గుడిమల్లం ఆలయ కుంభా భిషేకానికి ముమ్మర ఏర్పాట్లు..

**వచ్చే ఏప్రిల్ నాటికి పరశురామేశ్వరాలయ పునరుద్ధరణ పనులు పూర్తి.. ఈవో రామచంద్రారెడ్డి...**

రేణిగుంట. పెన్ పవర్, మార్చి, 21: భారతదేశంలోనే అత్యంత పురాతనమైన శివాలయంగా ప్రసిద్ధి గాంచిన తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం గుడిమల్లం గ్రామంలోని ఆనందవల్లీ సమేత శ్రీ పరశురామేశ్వర స్వామి దేవస్థానం పునఃవైభవానికి సిద్ధమవుతోంది. ఆలయంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న కుంభాభిషేకం కోసం గర్భాలయం మరియు రాజగోపురానికి మరమ్మతు పనులు ముమ్మరంగా సాగుతున్నాయని ఆలయ కార్యనిర్వహణాధికారి రామచంద్రారెడ్డి వెల్లడించారు. చాలా ఏళ్ల తర్వాత నిర్వహించే ఈ కుంభాభిషేకం కోసం దేవాలయ రాజగోపురం పైభాగం మరియు ఇతర నిర్మాణాలు దెబ్బతినడంతో కేంద్ర పురావస్తు శాఖ మరియు రాష్ట్ర దేవాదాయ శాఖ సంయుక్తంగా ఈ పునరుద్ధరణ పనులను చేపట్టాయి. గత మూడు నెలలుగా పక్కా ప్రణాళికతో ఈ పనులు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.



కేంద్ర పురావస్తు శాఖ వారు నిర్దేశించిన గడువులోపు గర్భాలయ గోపురం పనులను పూర్తి చేస్తారు. గర్భాలయంపై పనులు ప్రారంభించే సమయంలో ఆగమ శాస్త్ర నిబంధనల ప్రకారం బాలాలయం ఏర్పాటు చేసి స్వామివారిని ఆవాహన చేయడం జరుగుతుంది. ఈ పనుల నాణ్యతను పరిశీలించేందుకు ఢిల్లీ నుంచి పురావస్తు శాఖ ఉన్నతాధికారులు ఇప్పటికే పలుమార్లు ఆలయాన్ని సందర్శించి క్షేత్రస్థాయిలో పనులను పర్యవేక్షించారు. వచ్చే ఏప్రిల్ 15, 16 తేదీల నాటికి రాజగోపురం పనులన్నీ పూర్తి చేసి అప్పగిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ నెల 19వ తేదీ లోపు రాజగోపురానికి సంబంధించిన ప్రధాన మరమ్మతులు పూర్తయితే కుంభాభిషేకం నిర్వహించుకోవడానికి మార్గం సుగమం అవుతుందని రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ప్రధాన పనులు పూర్తయిన తర్వాత మిగిలిన చిన్నపాటి పనులను తదుపరి నలభై రోజుల్లో పూర్తి చేస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది మరియు పురావస్తు శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

# పాలిటిక్స్ లోకి నారా రోహిత్...

తిరుపతి, పెన్ పవర్, మార్చి, 21: తెలుగుదేశం పార్టీ అంటే ముందుగా గుర్తొచ్చే పేర్లు నందమూరి, నారా కుటుంబాల వారివి. తెలుగుదేశం పార్టీని స్థాపించి 9 నెలల కాలంలోనే అధికారంలోకి తీసుకు రాగలిగారు నందమూరి తారక రామారావు. అయితే చంద్రబాబు ఆ పార్టీకి సుదీర్ఘకాలం అధ్యక్షుడిగాను వ్యవహరించారు. నాలుగు దశాబ్దాల పాటు ఆ పార్టీని ముందుకు తీసుకెళ్లడంలో చంద్రబాబు పాత్ర మరువరానిది. అయితే ఇప్పుడు ఆ పార్టీకి భవిష్యత్తు నాయకుడు లోకేష్ అనడంలో సందేహం లేదు. తనను తాను ప్రూవ్ చేసుకొని ముందుకు సాగుతున్నారు లోకేష్. తెలుగుదేశం పార్టీని అనధికారిక అధ్యక్షుడిగా కొనసాగుతూ.. పార్టీని సమన్వయం చేసుకోవడమే కాదు బలోపేతం చేయడంలో లోకేష్ ముందుంటున్నారు. అదే సమయంలో నందమూరి కుటుంబం నుంచి బాలకృష్ణ తెలుగుదేశం పార్టీలో యాక్టివ్ గా ఉన్నారు. అయితే ఇప్పుడు నారా కుటుంబం నుంచి మరో యువ నేత రంగంలోకి వస్తారని ప్రచారం నడుస్తోంది. సినీ నటుడు నారా రోహిత్ పొలిటికల్ ఎంట్రీ ఉంటుందని ప్రచారం జోరుగా సాగుతోంది. అందుకు బలం చేకూరుస్తూ ఆయన సైతం ఫుల్ క్లారిటీ ఇచ్చారు. చంద్రబాబు నాయుడు సోదరుడిగా రామ్మూర్తి నాయుడు ఉండేవారు. ఆయన ఒకసారి చంద్రగిరి నుంచి ఎమ్మెల్యేగా కూడా గెలిచారు. చాలా రోజులపాటు అనారోగ్యంతో



బాధపడుతూ గత ఏడాది చనిపోయారు రామ్మూర్తి నాయుడు. ఆయన కుమారుడే నారా రోహిత్. తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు సాధించుకున్నారు. అయితే ఇంతవరకు ఆయనకు సినిమా రంగంలో సరైన బ్రేక్ తగలలేదు. మొన్ననే వివాహం చేసుకొని ఒక ఇంటి వాడు అయ్యాడు. అయితే తనకు రాజకీయ ఆసక్తి ఉందని తాజాగా వెల్లడించాడు. నారా రామ్మూర్తి నాయుడు జయంతి వేడుకలు ఆయన సొంత గ్రామం నారావారి పల్లెలో జరిగాయి. తండ్రికి నివాళులు అర్పించేందుకు నారా రోహిత్ వెళ్లారు. పొలిటికల్ ఎంట్రీ ఎప్పుడు ఉంటుందా అని మీడియా ప్రతినిధులు అడిగితే.. కచ్చితంగా ఉంటుందని ఆయన చెప్పారు. తనకు రాజకీయాలు అంటే ఇష్టంగా పేర్కొన్నారు. సరైన సమయంలో పొలిటికల్ ఎంట్రీ ఇస్తానని కూడా చెప్పుకొచ్చారు.నారా రామ్మూర్తి నాయుడు అనారోగ్యానికి గురికావడంతో నారా రోహిత్ బాధ్యతలను ఎక్కువగా చంద్రబాబు చూసుకున్నారు. ఆయన పొలిటికల్ గా బిజీగా ఉండడంతో పెద్దమ్మ భువనేశ్వరి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మొన్న రోహిత్ వివాహంలో కూడా భువనేశ్వరి అన్ని తానై వ్యవహరించారు. పెదనాన్న చంద్రబాబు, సోదరుడు లోకేష్ తో రోహిత్ కు మంచి సంబంధాలు ఉన్నాయి. 2024 ఎన్నికల్లో టిడిపి కూటమికి మద్దతుగా రోహిత్ ప్రచారం కూడా చేశారు. లోకేష్ తెలుగుదేశం పార్టీ నాయకత్వ బాధ్యతలు తీసుకుంటే కుటుంబ పరంగా ఆయనకు మద్దతు అవసరం. అందుకే నారా రోహిత్ పొలిటికల్ ఎంట్రీ కి సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. వచ్చే ఎన్నికల్లో ఆయన చంద్రగిరి నుంచి బరిలో దిగుతారని నారా అభిమానులు భావిస్తున్నారు. అయితే ప్రత్యక్ష ఎన్నికల్లోనే కాకుండా పార్టీ పరంగా కూడా నారా రోహిత్ సేవలను టిడిపి నాయకత్వం తీసుకునే ఛాన్స్ కనిపిస్తోంది. పెదనాన్న చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన మరుక్షణం టిడిపిలో యాక్టివ్ అయ్యేందుకు నారా రోహిత్ సిద్ధంగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# 27న రామతీర్థంలో నవమి వేడుకలు

నెల్లిమర్ల : పెన్ పవర్, మార్చి, 21: ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఎంతో ప్రతిష్టాత్మకమైన రామతీర్థంలో శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు విస్తత ఏర్పాట్లు చేస్తున్నట్టు నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి పేర్కొన్నారు. సీతారాముల కళ్యాణాన్ని భక్తులు తిలకించేందుకు భక్తులందరినీ ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. శనివారం శ్రీరామస్వామి వారి దేవస్థానం వద్ద శ్రీరామనవమి మహోత్సవ వేడుకల ఏర్పాట్లుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. దేవాలయంలో ఉచిత దర్శనం, శీఘ్రదర్శనం, వి.ఐ.పి. దర్శనం, క్యూలైన్లలో వచ్చు భక్తులకు తాగునీరు శ్రీవారి సేవ ద్వారా పంచడం, ఉచిత ప్రసాదం, ఉత్తర, దక్షిణ మరియు తూర్పు గోపురాలకు మరియు కళ్యాణం గ్రౌండునందు భక్తులకు ఎండ తగలకుండా ఏర్పాట్లపై సమీక్షించారు.కళ్యాణ మండపం వద్ద ప్రత్యేకంగా ఎల్.ఇ.డి. స్క్రీన్లు ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీతారాముల వారి కళ్యాణానికి పట్టు వస్త్రాలు సమర్పిస్తామని, సింహాచలం శ్రీవరాహ లక్ష్మీనసింహస్వామి దేవస్థానం వారు పట్టువస్త్రాలు సమకూరుస్తారని తెలిపారు. ఐదు లక్షల మందికిపైగా భక్తుల వస్తారని అంచనా వేసామని తెలిపారు. వర్చువల్గాఈనెల 25నగిరి ప్రదర్శనను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రారంభిస్తారని తెలిపారు. కళ్యాణానికి రామతీర్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ప్రజలు తిలకించేందుకు వీలుగా సీతారాములకళ్యాణాన్ని ఆలయంవెలుపల నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నందున భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారని రామతీర్థం సహాయ కమిషనర్, ఇఒ వై.శ్రీనివాసరావుని తెలిపారు. భక్తుల కోసం తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

# చిత్తూరు జిల్లా అంతటా “పల్లెనిద్ర” కార్యక్రమం చేపట్టిన జిల్లా పోలీసులు.

## సమాజంలో ఉన్న అన్ని అంశాలపై పల్లె పల్లెకి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు.

చిత్తూరు . పెన్ పవర్, మార్చి, 21: జిల్లా ఎస్పీ తుషార్ డూడి, ఆదేశాల మేరకు, జిల్లా అడిషనల్ ఎస్పీ రాజశేఖర్ నేతృత్వంలో జిల్లా అంతటా పోలీసులు గ్రామాల నందు “పల్లెనిద్ర” కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. గ్రామీణ ప్రాంత ప్రజల భద్రత, అవగాహన, పోలీసు--ప్రజల మధ్య స్నేహపూర్వక సంబంధాలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని పోలీసులు తెలిపారు. పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా పోలీసులు ప్రజలకు “ధైర్య--స్పర్శ” కార్యక్రమం గురించి వివరిస్తూ పోలీసులే కాకుండా మీ ప్రాంతంలో అలాంటి ప్రదేశాలు ఉన్నట్టు గుర్తించిన పోలీసులకు తెలియజేయవచ్చునని తెలిపారు. మహిళలు మరియు చిన్నపిల్లలపై జరుగుతున్న నేరాల నివారణ, బాధితులు ఎదుర్కొనే పరిస్థితులు, ఫిర్యాదు చేసే విధానం, అలాగే తక్షణ సహాయం పొందే మార్గాలపై వివరించారు. సైబర్ క్రైమ్స్ విషయంలో సోషల్ మీడియా, ఆన్‌లైన్ లావాదేవీలలో జాగ్రత్తలు, మోసాలకు గురికాకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక, కుటుంబ పరమైన నష్టాలను వివరిస్తూ యువత మత్తుకు దూరంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాల వల్ల కలిగే చట్టపరమైన మరియు సామాజిక సమస్యలపై స్పష్టతనిస్తూ, చట్టబద్ధమైన వయస్సు అనంతరమే వివాహం జరగాలని ప్రజలకు తెలియజేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం, వేగ నియంత్రణ, మద్యం సేవించి వాహనాలు నడపకూడదనే అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు.



అదేవిధంగా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణ, ఆధారాల సేకరణలో కలిగే ప్రయోజనాలను వివరించారు. పోలీసు--ప్రజల మధ్య నమ్మకం, సహకారం పెంపొందించుకోవడం ద్వారా మాత్రమే నేరరహిత సమాజం సాధ్యమవుతుందని తెలియపరిచారు. ప్రజల భాగస్వామ్యం, పోలీసుల నిరంతర కృషి ద్వారా గ్రామాలను మరింత సురక్షితంగా, శాంతియుతంగా మార్చడమే “పల్లెనిద్ర” కార్యక్రమం యొక్క ప్రధాన లక్ష్యమని పోలీసులు స్పష్టం చేశారు.

# తిరుమలలో అత్యాధునిక ఫుడ్ అనాలిసిస్ ల్యాబ్‌ను ప్రారంభించిన చంద్రబాబు,

తిరుమల, పెన్ పవర్, మార్చి, 21: తిరుమలలో అత్యాధునిక ఫుడ్ అనాలిసిస్ ల్యాబ్‌ను ప్రారంభించారు చంద్రబాబు. ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన 50కి పైగా పరికరాలను చంద్రబాబు పరిశీలించారు. న్యూఢిల్లీ నుంచి వచ్చిన ఎఫ్ఎస్ఎస్ఏఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీ పాండా, సిఎఫ్‌టీఆర్ఐ డైరెక్టర్ శ్రీ గిరిధర్ ల్యాబ్‌లోని ప్రతి పరికరం పనితీరును సీఎంకు వివరించారు. తిరుమలలోని టీటీడీ వాటర్ అండ్ ఫుడ్ అనాలిసిస్ ల్యాబ్ భక్తులకు సురక్షితమైన నీరు మరియు ఆహారాన్ని అందించేందుకు వివిధ వనరుల నుంచి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహిస్తోంది. తిరుమలలో అత్యాధునిక ఫుడ్ అనాలిసిస్ ల్యాబ్‌ను ప్రారంభించిన చంద్రబాబు, ఋణ ఆలయాలను ఆధునిక ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని ఆదేశం!


– శ్రీవారి ప్రసాదం, అన్నప్రసాదం తయారీలో ఉపయోగించే ముడి పదార్థాలను పరీక్షించడం.

– ప్రతి నెల 1,000 నుంచి 1,500 నమూనాలపై పరీక్షలు నిర్వహించడం.

ల్యాబ్ విస్తరణ :

ఆలయం అవసరాల మేరకు దేశంలోనే ఏర్పాటు చేసిన ఈ తొలి అధునాతన ల్యాబ్ ఎఫ్ఎస్ఎస్ఏఐ , ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సహకారంతో (కోర్ ల్యాబ్‌కు రూ. 25 కోట్లు, ఈ–టంగ్/ఈ–నోస్‌కు రూ. 3.5 కోట్లు, పవర్ సెటప్‌కు రూ. 1.10 కోట్లు) నిర్మించిన ఈ 12,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. ఈ ల్యాబ్‌లో 6,000 చదరపు అడుగులు రసాయనాల విశ్లేషణకు, మరో 6,000 చదరపు అడుగులు మైక్రో బయాలాజికల్ విశ్లేషణకు కేటాయించారు.

తిరుమలలో అత్యాధునిక ఫుడ్ అనాలిసిస్ ల్యాబ్‌ను ప్రారంభించిన చంద్రబాబు, ఋణ ఆలయాలను ఆధునిక ఆధ్యాత్మిక కేంద్రాలుగా తీర్చిదిద్దాలని



ఆదేశం!

అత్యాధునిక పరికరాలు

– GC/GC-MS : కొవ్వు ఆమ్లాలు, పురుగుమందులు, వాయువీయ పదార్థాల పరీక్షలు.

– HPLC/LC-MS : మైక్రోటాక్సిన్లు, ఔషధాలు, యాడిటివ్‌ల పరీక్షలు.

– AAS/ICP-MS : ఆహారం మరియు నీటిలో భారీ లోహాల గుర్తింపు.

– ఇతర పరికరాలలో ఫైబర్/ప్రోటీన్/ఫ్యాట్ అనలైజర్లు, బ్యూటిరో రిఫ్రాక్టోమీటర్, యూవీ–విజిబుల్ స్పెక్ట్రోఫోటోమీటర్ ఉన్నాయి. మరోవైపు ఋణ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆలయాలను అత్యంత ఆధునాతన ఆధ్యాత్మిక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని పిలుపునిచ్చారు చంద్రబాబు. మార్చి 21 శనివారం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్షించారు. తిరుమలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించే చర్యలు అరికట్టేందుకు అత్యాధునిక సీసీ కెమెరాలు, ఫేసియల్ రికగ్నిషన్ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. తిరుమలలో కాలుష్యానికి తావు లేకుండా చర్యలు తీసుకోవాలని..మరిన్ని ఆలయాల నిర్మాణం ద్వారా భక్తిభావం పెంపొందించేలా కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. శ్రీవారి సేవలో పాల్గొనే భక్తులకు నైపుణ్యానికి తగ్గట్టుగా శిక్షణ ఇచ్చి టీటీడీ పరిధిలో అన్ని ఆలయాల్లో వినియోగించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఋణలో అమలు చేస్తున్న విధానాలనే దేశంలో ఇతర ఆలయాలకు మరింత మార్గదర్శకంగా నిలిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంతకుముందు కమాండ్ కంట్రోల్ సెంటర్ సేవలపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ముఖ్యమంత్రికి వివరించారు. లడ్డూ తయారీ, విక్రయం, నిల్వ వంటి అంశాలను సమగ్రంగా పర్యవేక్షిస్తున్నామని అధికారులు చెప్పారు. NRI దాతల సహకారంతో కార్యా ఫౌండేషన్ ద్వారా కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలను అమెరికాలో దాత శ్రీ వేజేండ్ల జయప్రసాద్ వర్చువల్ ద్వారా ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడుకు వివరించారు.

# పవన్ కల్యాణ్ పై అరవ శ్రీధర్ బాధితురాలి సంచలన వీడియో!

కడప. పెన్ పవర్, మార్చి, 21: నిను వీడని నీడని నేను అన్నట్టు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌ను ఓ మహిళ వెంటాడుతోంది. తనకు అన్యాయం చేసిన ఆ వ్యక్తికి శిక్ష పడే వరకు పోరాటం చేస్తానంటూ గతంలో చెప్పిన ఆమె ఇప్పుడు మరో వీడియో విడుదల చేసింది. ఈ వ్యవహారంలో దర్యాప్తు చేస్తున్న జనసేన కమిటీ నిర్ణయం వెలుగులోకి రాక ముందే పార్టీ కార్యక్రమాల్లో శ్రీధర్ పాల్గొనడంపై బాధితురాలు ప్రశ్నిస్తున్నారు. నేరుగా పవన్ కల్యాణ్‌ను నిలదీస్తున్నారు. పార్టీకి, పవన్ కల్యాణ్‌కు ఉన్న విలువ ఇదేనా అంటూ క్వశ్చన్ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో, ముఖ్యంగా కూటమి ప్రభుత్వంలో రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై వచ్చిన ఆరోపణలు పెను దుమారం రేపాయి. లైంగిక దాడికి పాల్పడటంతోపాటు, పలుమార్లు బలవంతంగా గర్భస్రావం చేయించారనే బాధిత మహిళ ఆరోపించారు. ఈ కేసులో బాధితురాలు శనివారం మరో సంచలన వీడియోను బాధితురాలు విడుదల చేశారు. తాజాగా విడుదల చేసిన వీడియోలో బాధితురాలు తన ఆవేదనను వ్యక్తం చేస్తూ కొన్ని కీలక ప్రశ్నలు లేవనెత్తారు. అరవ శ్రీధర్‌పై వచ్చిన ఆరోపణల వేళ జనసేన పార్టీ ఒక అంతర్గత కమిటీని నియమించిన సంగతి తెలిసిందే. ఆ కమిటీ నివేదిక ఇచ్చే వరకు శ్రీధర్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని తొలుత ఆదేశాలు వచ్చాయి. అయితే బాధితురాలు తన వీడియోలో చాలా ప్రశ్నలు సందించారు. అరవ శ్రీధర్‌పై జనసేన వేసిన కమిటీ రిపోర్ట్ ఇంత వరకు ఎందుకు బయటకు రాలేదు. కమిటీ నివేదిక రాకుండా శ్రీధర్ పార్టీ కార్యక్రమాల్లో ఎలా పాల్గొంటారు. అరవ శ్రీధర్‌కు పవన్ అంటే లెక్కలేదా? లేకుంటే ఇంటర్నల్‌గా ఏమైనా క్లీన్ చిట్ ఇచ్చారా అని నిలదీశారు. నివేదిక రాకుండానే అరవ శ్రీధర్ జనసేన కండువా కప్పుకొని తిరుగుతుంటే తనకు న్యాయం ఎప్పుడు జరుగుతుందని బాధితులు ప్రశ్నించారు. బాధితురాలు ఆరోపిస్తున్నట్టుగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఇటీవలి కాలంలో తన నియోజకవర్గంలో బహిరంగంగా పర్యటిస్తున్నారు. రైల్వేకోడూరు



నియోజకవర్గంలోని ముక్కావారిపల్లిలో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన జనసేన కండువా కప్పుకొని పాల్గొనడం చర్చనీయాంశమైంది.

“క్లీన్ చిట్ ఇస్తే నాకు కర్టీడా చెప్పండి”

అందుకే బాధితులు తాజాగా విడుదల చేసిన వీడియోలో” పార్టీ ఏమైనా క్లీన్ చిట్ ఇచ్చారా. తనకు తెలియకుండా అలా ఇచ్చి ఉంటే తనకు తెలుసుకునే హక్కు ఉంది. పవన్‌కు మద్దతు ఇచ్చే వ్యక్తిగా నాకు ఆ రైట్ ఉంది. అందుకే వీటిపై క్లారిటీ అడుగుతున్నాను. అలా క్లీన్ చిట్ ఇవ్వలేదు. అంటే పార్టీ కండువా వేసుకొని శ్రీధర్ పార్టీ కార్యక్రమాల్లో ఎలా పాల్గొంటారు. అలా పాల్గొన్న వ్యక్తిపై చర్యలు తీసుకోరా. లేదంటే నేను అంటే లెక్కలేనట్టే మీరు చెప్పినా సరే ఇలా చేస్తున్నారంటే మీరంటే కూడా లెక్కలేదని అనుకోవాలా? శ్రీధర్ అనే వ్యక్తికి పవన్ కల్యాణ్, జనసేన పార్టీ చెప్పినా పట్టించుకోడు. వారికి ఆయన దృష్టిలో విలువ లేదు అని అనుకోవాల్సి ఉంటుంది. “ అని బాధితురాలు హెచ్చరించారు.

# పెట్రోల్ కోసం పడిగాపులు

చింతపల్లి : పెన్ పవర్, మార్చి, 21: ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో ఇంధన సరఫరాకు అంతరాయం కలుగుతుందన్న భయంతో చింతపల్లి మండలంలో పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారులు బంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు. శనివారం ఉదయం నుంచే మండల కేంద్రంలోని పెట్రోల్ బంకుల వద్ద వాహనదారులు భారీగా బారులు తీరారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, నాలుగు చక్రాల వాహనదారులు గంటల తరబడి క్యూలో నిల్చున్న దృశ్యాలు కనిపించాయి. పెట్రోల్ అందుబాటులో ఉండదన్న వార్తలు సామాజిక మాధ్యమాల్లో వ్యాప్తి చెందడంతో ప్రజలు ఒక్కసారిగా బంకులకు తరలివచ్చారు. దీంతో సాధారణ రోజులతో పోలిస్తే డిమాండ్ భారీగా పెరిగి, కొన్ని బంకుల్లో తాత్కాలికంగా నిల్వలు తగ్గినట్లు సమాచారం. మండల కేంద్రంలోని జిసిసి పెట్రోల్ బంక్‌లో పెట్రోల్, డీజిల్ లేకపోవడంతో, పట్టణంలో ఉన్న మరో బంకు వద్ద పెద్ద సంఖ్యలో వాహనదారులు గుమిగూడారు. దీనివల్ల కొంత గందరగోళ పరిస్థితి నెలకొంది.



బంకు సిబ్బంది ఒక్కో వాహనానికి పరిమితంగా మాత్రమే ఇంధనం ఇస్తూ పరిస్థితిని నియంత్రించే ప్రయత్నించారు. కొందరు వాహనదారులు క్యాన్లలో కూడా పెట్రోల్ తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా, మరికొందరు అప్పు తెచ్చుకుని ఫుల్ ట్యాంక్ చేసుకుంటున్నట్లు తెలిసింది. అధికారులు మాత్రం ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సరఫరా సాధారణంగానే కొనసాగుతోందని స్పష్టం చేశారు. ఒక్కసారిగా పెరిగిన డిమాండ్ కారణంగా బంకుల వద్ద రద్దీ పెరిగి, ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు బంకుల నుంచి బ్లాక్ మార్కెట్‌కు పెట్రోల్ తరలిపోతుందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై అధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని, అవసరమైన మేరకు పెట్రోల్, డీజల్ సరఫరా చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

# రేణిగుంటలో రంజాన్ సంబరాలు భక్తి శ్రద్ధలతో ఈద్గా మైదానంలో ప్రత్యేక ప్రార్థనలు.

రేణిగుంట. పెన్ పవర్, మార్చి, 21: తిరుపతి జిల్లా రేణిగుంటరేణిగుంటలో మిన్నంటిన రంజాన్ సంబరాలుభక్తి శ్రద్దలతో ఈద్గా మైదానాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లిం సోదరులు రంజాన్ ప్రార్థనలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్న రేణిగుంట పట్టణం భారీగా ఏర్పాటు చేసిన ఈద్గా మైదానానికి మొత్తం ఐదు మసీదుల నుండి వచ్చి ప్రార్థనలు చేశారు. పోటెత్తిన ముస్లింలు అల్లాహ్ ను స్మరిస్తూ సామూహిక నమాజ్ నిర్వహించిన వేలాదిమంది భక్తులు లోక కళ్యాణం కోసం దేశం సుభిక్షంగా ఉండాలని ప్రత్యేక ప్రార్థనలు ప్రార్థనల అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుని ఈద్ ముబారక్ తెలుసుకున్న సోదరులు మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన రంజాన్ పండుగ వేడుకలు ఈద్గా వద్ద ఎటువంటి ఇబ్బందులు కలగాకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు మత పెద్దలు ఆశర్ఫ్ మత పెద్దలు మాత గురువులు హాపీ సాహెబ్ ఖలీల్ ,అబ్దుల్లా, మైనారిటీ నాయకులు జీకే మునీర్ రఫీ షఫీ ఆలీ జుబేరా యాత్ శ్రీకాళహస్తి నియోజకవర్గం మైనారిటీ అధ్యక్షుడు అఫ్రోజ్ మున్నా గౌసి జాఫర్ ముబారక్ తదితరులు పాల్గొన్నారు.




01

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

క్లాసీఫైడ్ యాడ్స్

కేవలం

యాడ్ 100/-కే

' ఐదు రోజులకు '

‘4 సెం.మీ 4 సెం.మీ’

‘మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి


# కడపలో నైట్ పెట్రోలింగ్ ముమ్మరం : ఎస్పీ



కడప: పెన్ పవర్, మార్చి, 21: కడప జిల్లాలో నేరాల నియంత్రణే లక్ష్యంగా పోలీసులు నైట్ పెట్రోలింగ్ ముమ్మరం చేసినట్లు ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ తెలిపారు. తాళాలు వేసిన ఇళ్లు, దేవాలయాలు, ఏటీఎంలు వ్యాపార సముదాయాల వద్ద చోరీలు జరగకుండా క్షేత్రస్థాయి సిబ్బంది నుండి డీఎస్పీల వరకు రాత్రివేళ గస్తీని పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. అనుమానిత వ్యక్తులు, వాహనాలను నిశితంగా తనిఖీ చేయడంతో పాటు లాడ్జీల్లో అసాంఘిక కార్యకలాపాలు సాగకుండా ఆధార్ కార్డులను పరిశీలిస్తూ ప్రత్యేక నిఘా ఉంచారు. ముఖ్యంగా పాత నేరస్తుల కదలికలపై మొబైల్ చెక్ డివైజ్ ద్వారా నిఘా పెంచుతూ, మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై మరియు అకారణంగా తిరిగే ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. రహదారి ప్రమాదాల నివారణకు తెల్లవారుజామున వాహనదారుల కోసం ‘స్టాప్ అండ్ వాష్’ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందిస్తున్నారు. చట్టవ్యతిరేక పనులకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

# కడప జిల్లా సీఐ అశోక్‌రెడ్డిపై సి.కె. దిన్నె పోలీసు స్టేషన్లో కేసు నమోదు.




కడప : పెన్ పవర్, మార్చి, 21: సీఐ అశోక్‌రెడ్డిపై నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేసారు. అనంతపురం వాసి ప్రభాకర్ను బెదిరించి ఆస్తులు సెటిల్మెంట్లు చేసినట్లు సీఐ అశోక్‌రెడ్డిపై ఆరోపణలు వచ్చాయి. ప్రభాకర్ను సి.కె.దిన్నె పీఎస్లో సీఐ అశోక్‌రెడ్డి 2 రోజులు నిర్బంధించినట్లు ఫిర్యాదులో వెల్లడి అయింది. ప్రభాకర్ ఫిర్యాదు మేరకు సి.కె.దిన్నె పోలీసులు కేసు నమోదు చేసారు. . విచారణ జరిపి వారం కిందటే సీఐ అశోక్‌రెడ్డిని డిఐజీ సస్పెండ్ చేసారు.

# ఆనం ఆపశోపాలు.. ఏం జరిగింది.. ?

**హైదరాబాద్ పెన్ పవర్:** సీఎం చంద్రబాబు టీంలో ఉన్న మంత్రుల్లో చాలా మంది యాక్టివ్‌గానే ఉన్నారు. అయితే.. దేవదాయ శాఖ మంత్రిగా ఉన్న ఆనం రామనా రాయణరెడ్డి మాత్రం చాలా వరకు వెనుకబడ్డారనే టాక్ వినిపిస్తోంది. ఈయనది ఒక చోట కూర్చుని చేసే పనికాదు. రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించాలి. ఎక్కడ ఏ చిన్న తప్పు జరిగి నా.. అది సర్కారుకు బ్యాడ్ నేమ్ తెస్తుంది. దీంతో తరచుగా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించి.. ఆయా ఆలయా లను దర్శించి.. మార్పులు, చేర్పులు చేయాల్సి ఉంటుంది.కానీ.. జిల్లాల్లో పర్యటించే పరిస్థితి లేదని ఆనం చెబుతున్నారు. ఇటీవల జరిగిన మంత్రి వర్గ సమావేశానికి కూడా ఆయన చాలా ఆలస్యంగా వచ్చారు. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో జరుగుతున్నపనులు, వస్తున్న ఫిర్యాదులపై సీఎం చంద్రబాబు ఆయనను ప్రశ్నించారు. దీనికి ఆయన ముక్తసరిగా సమాధానం చెప్పారు. తాను జిల్లాల్లో పర్యటించలేక పోతున్నానని ఆయన చెప్పినట్టు తెలిసింది. వయసు సహా.. ఆరోగ్య సమస్యలను ఆయన ప్రస్తావించారు.అంతేకాదు.. దేవదాయ శాఖ అంటే.. పని లేదని చాలా మంది అనుకుంటున్నారని.. కానీ, ఎక్కువ పని ఉండేది ఈ శాఖకేనని ఆయన చెప్పడం గమనార్హం. అంతేకాదు.. ప్రతి ఒక్కరినీ సంతృప్తి పరచాల్సి ఉంటుందని కూడా వ్యాఖ్యానించారు. తనకు కొన్ని కొన్ని సందర్భాల్లో టెన్షన్ కూడా పెరుగుతోందన్నారు. ఇటీవల తిరుమల లడ్డూ విషయంపై వివాదం చెలరేగినప్పుడు.. ఆనం పెద్ద గా రియాక్ట్ కాలేదు. దీనికి కూడా ఆయన టెన్షనే కారణమని చెప్పినట్టు తెలిసింది.ఈ

పరిణామాలతో సీఎం చంద్రబాబు ఆయనను ఎక్కువగా విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. మరో వైపు.. నియోజకవర్గంలో కూడా.. ఆనం పెద్దగా పర్యటించడం లేదు. ఆత్మకూరులోని నాలుగు మండలా లకు.. నలుగురు అనుచరులను పెట్టి .. వారి ద్వారా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. తాను అప్పుడప్పు డు వెళ్లి.. ఆయా కార్యక్రమాలను చక్కదిద్దుతున్నారు. ఇంతకు మించి.. ఆనం ఏమీ చేయడం లేదని తెలుస్తోంది. సో.. రేపు మంత్రి వర్గ విస్తరణ జరిగితే.. ఆనంకు శాఖనైనా మార్చడమో.. లేదా తప్పించడమో తప్పదన్న వాదన వినిపిస్తోంది.






# పుట్టా విషయంలో బాబు ఆ పని చేస్తారా...?

**హైదరాబాద్ పెన్ పవర్:**ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్.. డ్రగ్స్ కేసులో పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్న టీడీపీ అధిష్టానం ఆయన నుంచి వివరణ కోరింది. దీనికిగాను ఐదు రోజుల సమయం ఇచ్చింది. ఈ గడువు ముగియడంతో పుట్టా.. తాజాగా తన వివరణను పార్టీ ఏపీ చీఫ్ పల్లా శ్రీనివాసరావుకు అందించారు. దీనిలో ఏముంది.. అనేది పెద్దగా సందేహమేమీ లేదు. దీనిపై పెద్దగా ఎవరికీ ఉత్కంఠ కూడా లేదు. ఈ కేసు బయట పడినప్పటి నుంచి పుట్టా చేస్తున్న వాదన ప్రకారం.. ఈ కేసుతో తనకు సంబంధం లేదని.. తనకు ఎలాంటి అలవాట్లు లేవని.. చెబుతున్నారు. బీఆర్ ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తన చిరకాల మిత్రుడని.. అందుకే ఆయన పిలిస్తే డిన్నర్ పార్టీకి వెళ్లానని అంటున్నారు. దీనికి సంబం ధించి ఆయన రెండు సార్లు తన వివరణను బహిరంగంగానే వెల్లడించారు. నియోజకవర్గ ప్రజలకు కూడా సెల్ఫీ వీడియో ద్వారా వివరించారు. సో.. ఇప్పుడు కూడా అదే వివరణను పార్టీకి ఇచ్చి ఉంటారు. దీనిలో ఎలాంటి సందేహం లేదు. అయితే.. ఇప్పుడు చంద్రబాబు ఎలాంటి చర్యలు తీసుకుంటారు ? అనేది ప్రశ్న. ఎందుకంటే.. పార్టీలో ఇంత పెద్ద సమస్యల్లో చిక్కుకున్నవారు లేకున్నప్పటికీ.. తరచుగావివాదాలకు కేంద్రంగా మారుతున్న నాయకులు ఉన్నారు. అలాంటి వారు.. తమపై చర్యలకు అధిష్టానం సిద్ధమవుతుందన్న బెంగ వెంటాడుతోంది. ఇలాంటి సమయంలో పుట్టా వ్యవహారం వచ్చే సరికి.. పార్టీలో ఆసక్తిగా మారింది. వాస్తవానికి ప్రతిపక్షం కంటే సొంత పార్టీలోనే పుట్టాపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్న విషయంపై ఆసక్తి, ఉత్కంఠ నెలకొంది. కానీ, చంద్రబాబుకు ఈ విషయం మింగుడు పడని వ్యవహారంగా మారింది. బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కావడంతోపాటు.. యువ నేత అనే ట్యాగ్ కూడా ఉంది. మరీ ముఖ్యంగా పార్టీకి సుదీర్ఘ సేవలందిస్తున్న మాజీ మంత్రి యనమల రామకృష్ణుడుకు స్వయానా అల్లుడు కావడంతోపాటు.. పార్టీకి కీలకమైన పుట్టా సుధాకర్ తనయుడు కూడా కావడంతో ఎలాంటి చర్యలు తీసుకున్నా.. అది దీర్ఘకాలిక ప్రభావం చూపించే అవకాశం ఉంటుందన్న చర్చ సాగుతోంది. అయితే.. కొన్నాళ్ల పాటు పార్టీ నుంచి సస్పెండ్ చేసేందుకు మాత్రమే చంద్రబాబు మొగ్గు చూపుతారని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఆ తర్వాత.. ఈ కేసు పరిణామాలను బట్టి.. ఆయనను చేరదీయ వచ్చని తెలుస్తోంది. ఏదే మైనా.. బలమైన, భయంకరమైన చర్యలను ఊహించలేమని పలువురు వ్యాఖ్యానించడం గమనార్హం.

# తిరుమల పూర్తిగా మారిపోతుందా..? ప్రసాదాలు, దర్శనాలపై కీలక మార్పులు

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమల సన్నిధిలో ప్రసాదాల నాణ్యత, దర్శన సమయాల పర్యవేక్షణ విషయంలో కీలక అడుగు పడింది. ప్రసాదాల నాణ్యత పరీక్షించేందుకు అత్యాధునిక వాటర్ – ఫుడ్ అనాలసిస్ ల్యాబ్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. అదేసమయంలో దర్శన సమయంలో జాప్యాన్ని నివారించేందుకు ూ× ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (×జజజ) ఏర్పాటు చేశారు. ఈ రెండింటిపై ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ తిరుమల అధికారులకు కీలక సూచనలు చేశారు.తిరుమల లడ్డూ ప్రసాదంలో రసాయనాలతో తయారు చేసిన నెయ్యి వాడకం తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వం తిరుమలలో అత్యాధునిక వాటర్–ఫుడ్ అనాలసిస్ ల్యాబ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. భక్తుల నమ్మకాన్ని కాపాడటమే కాకుండా నాణ్యమైన ప్రసాదాన్ని అందించాలనే సంకల్పంతో తిరుమలలో ఫుడ్ సేఫ్టీపై ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రూ.25 కోట్లతో ఏర్పాటు చేసిన అత్యాధునిక ఫుడ్ ల్యాబ్ ను శనివారం ప్రారంభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు మనవడు, మంత్రి లోకేశ్ కుమారుడు దేవాన్ష్ పుట్టిన రోజు సందర్భంగా ముఖ్యమంత్రి కుటుంబం తిరుమలకు వచ్చింది. ఈ సందర్భంగా ఫుడ్ ల్యాబ్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.ఫుడ్ ల్యాబ్ ప్రారంభం తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, భక్తుల నమ్మకానికి చిన్నపాటి విఘాతం కూడా వాటిల్లకూడదని అధికారులను ఆదేశించారు. భక్తులకు నాణ్యమైన ప్రసాదాన్ని, తాగునీటిని అందించేందుకు టెక్నాలజీని వినియోగిస్తూ చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. కలియుగ వైకుంఠం తిరుమలకు వచ్చే కోట్లాది మంది భక్తుల నమ్మకం, విశ్వాసాలను మరింత పెంచేలా... ఆరోగ్య భద్రతే ధ్యేయంగా టీటీడీ మరో చారిత్రాత్మక అడుగు వేసిందని కొనియాడారు.స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీ, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఖీూూ×) సంయుక్తంగా టీటీడీ సహకారంతో రూ.25 కోట్ల వ్యయంతో అత్యాధునిక వాటర్ – ఫుడ్ అనాలసిస్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసింది. దేశంలోనే ఒక ఆలయం కోసం ఏర్పాటు చేసిన మొట్టమొదటి అత్యున్నత ప్రమాణాలు కలిగిన ల్యాబ్ ఇదేనని ప్రభుత్వం తెలిపింది. ల్యాబ్ ప్రారంభించిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ల్యాబ్ పనితీరు, సామర్థ్యం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రసాదాల తయారీలో వాడే ముడి పదార్థాల నాణ్యతను ఏ స్థాయిలో విశ్లేషించవచ్చని ముఖ్యమంత్రి ప్రశ్నించారు.12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో కెమికల్, మైక్రోబయాలజీ విభాగాలుగా దీనిని నిర్మించారు. ఇందులో ఈ–టంగ్, ఈ–నోస్, వంటి అత్యాధునిక సౌకర్యాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇవి ఆహార పదార్థాల రుచి, వాసనను డిజిటల్ పద్ధతిలో ఖచ్చితంగా విశ్లేషించగలవని అధికారులు సీఎంకు వివరించారు. 1981లో నీటి పరీక్షల కోసం చిన్నదిగా ప్రారంభమైన ఈ విభాగం, ఇప్పుడు నెలకు 1,000 నుంచి 1,500 శాంపిళ్లను విశ్లేషించే స్థాయికి చేరడం పట్ల సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు.

### తిరుమలలో ల్యాబ్ దేశానికే ఆదర్శం

బ్యాక్టీరియా గుర్తింపు కోసం ప్రత్యేకంగా క్లీన్ రూమ్, ఎయిర్ హ్యాండ్లింగ్ సిస్టమ్ వంటి భద్రతా ప్రమాణాలను చూసి ముఖ్యమంత్రి చంద్రబాబు అభినందించారు. శ్రీవారి ప్రసాదాల పట్ల భక్తులకు ఉన్న అపారమైన నమ్మకాన్ని కాపాడటమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యంగా అధికారులు పని చేయాలని స్పష్టం చేశారు. కేవలం ల్యాబ్ పరీక్షలకే పరిమితం కాకుండా, అన్నప్రసాద కేంద్రాల్లోని వంటశాలల శుభ్రతపై నిరంతర తనిఖీలు నిర్వహించి పరిశుభ్రతను నిర్ధారించాలని ఆదేశించారు. టీటీడీ తీసుకున్న ఈ చర్యలు శ్రీవారి ప్రసాదాల పట్ల మరింత నమ్మకాన్ని, విశ్వాసాన్ని పెంచాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

### ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రం సందర్శన

భక్తులకు త్వరితగతిన శ్రీవారి దర్శన భాగ్యం కలిగేందుకు, రద్దీ నియంత్రణ కోసం తీసుకువచ్చిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సందర్శించారు. భక్తులకు వేగంగా శ్రీవారి దర్శనం జరిగేలా ఈ కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని సమర్థంగా నిర్వహించాలని సీఎం సూచించారు. ప్రపంచంలోనే ఎక్కువ మంది భక్తులు దర్శించే పుణ్య క్షేత్రం కావడంతో జనసాంద్రత, దర్శన–సమయాలను సమర్థంగా నిర్వహించేలా కమాండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు సీఎం వెల్లడించారు. AI ఆధారిత ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ICCC) ద్వారా జనసాంద్రత, దర్శనం కొసం వేచి ఉండే సమయం, వాహన చలనం, వసతి, సీసీటీవీ వాతావరణం, వైద్య అత్యవసరాలు అన్నీ ఒకే ప్లాట్‌ఫారం ద్వారా రియల్ టైమ్‌లో పర్యవేక్షణ ఉంటుందని అధికారులు వెల్లడించారు. AI-ఆధారిత విశ్లేషణ ద్వారా రద్దీ పెరిగే పరిస్థితులను ముందే అంచనా వేసి క్యూ మేనేజ్మెంట్ సమర్థంగా నిర్వహించేందుకు ఆస్కారం ఉంటుందని చెబుతున్నారు. ఐటీ శాఖ మంత్రి లోకేష్ చొరవతో టీటీడీలో కమాండ్ కంట్రోల్ కేంద్రం ఏర్పాటు అయిందని అంటున్నారు. దేశంలోని ఇతర ప్రముఖ ఆలయాలకు ఈ కేంద్రం స్ఫూర్తిగా నిలుస్తుందని ఆశిస్తున్నారు.

# మధ్యాహ్న భోజనంపై గరికపాటి షాకింగ్ కామెంట్స్.. విమర్శల వెల్లువ

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు అంటే తెలుగు రాష్ట్రాల్లో తెలియని వారు ఉండరు. తన వాక్చాతుర్యంతో ధర్మం గురించి, సమాజం గురించి అద్భుతంగా వివరించే ఆయన, తాజాగా మధ్యాహ్న భోజనం పథకంపై చేసిన వ్యాఖ్యలు పెను దుమారాన్ని రేపుతున్నాయి. పేద విద్యార్థులకు పెట్టే ఆహారం, ఇచ్చే పుస్తకాలపై ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. అసలు గరికపాటి ఏమన్నారు? ప్రజలు ఎందుకు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు? ఈ వివాదం వెనుక ఉన్న అసలు సంగతేంటో ఇప్పుడు చూద్దాం.



**వివాదానికి కేంద్ర బిందువైన వ్యాఖ్యలు:**

గరికపాటి గారు ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫాంలు, పుస్తకాలు అందించాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. చదువుకోవాలనే కసి ఉన్న విద్యార్థి ఇంటి నుంచే అన్నం తెచ్చుకోవాలని, లేదంటే మానేయాలని ఆయన అనడం అందరినీ విస్మయానికి గురిచేసింది. ముఖ్యంగా భోజనంలో గుడ్లు పెట్టడం వంటి నిర్ణయాలను "అర్థరహితం" అని కొట్టిపారేయడం, ప్రభుత్వం కేవలం విద్యాబోధనకే పరిమితం కావాలని సూచించడం ఇప్పుడు పెద్ద చర్చకు దారితీసింది. ఇవన్నీ ఉచితంగా ఇస్తుంటే విద్యార్థులు "శోభనం గదిలో పెళ్లికొడుకుల్లా" తయారవుతారని ఆయన చేసిన ఘాటు వ్యాఖ్యలు విమర్శల వెల్లువకు కారణమయ్యాయి.

**పేదరికం – పథకాల ఆవశ్యకత:**

మరోవైపు, సామాజిక విశ్లేషకులు మరియు సామాన్య ప్రజలు గరికపాటి మాటలను తప్పుబడుతున్నారు. భారతదేశం లాంటి దేశంలో పేదరికం కారణంగా ఎంతోమంది పిల్లలు బడికి వెళ్లలేని పరిస్థితి ఉంది. మధ్యాహ్న భోజనం అనేది కేవలం ఆకలి తీర్చడమే కాదు, అది అట్టడుగు వర్గాల పిల్లలను బడికి రప్పించే ఒక గొప్ప ప్రోత్సాహకం. పౌష్టికాహారం లోపంతో బాధపడుతున్న పిల్లలకు గుడ్డు, పాలు ఇవ్వడం వల్ల వారి ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా, వారు చదువుపై శ్రద్ధ పెట్టగలుగుతున్నారు. ఇక ప్రభుత్వం వేల కోట్లు ఇతర ఖర్చుల కోసం వెచ్చిస్తున్నప్పుడు, దేశ భవిష్యత్తు అయిన పిల్లల కోసం ఈ మాత్రం ఖర్చు చేయడంలో తప్పేముందని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

**నైతికత మరియు సామాజిక బాధ్యత:**

గరికపాటి వంటి మేధావులు ధర్మం గురించి చెబుతున్నప్పుడు, ఆ ధర్మంలో ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం కూడా ఒక భాగమని గుర్తుంచుకోవాలని చాలామంది అభిప్రాయపడుతున్నారు. ఒక విద్యార్థికి పుస్తకాలు, దుస్తులు కొనుక్కోలేని ఆర్థిక స్తోమత లేనప్పుడు, ప్రభుత్వం అండగా నిలవడమే కనీస బాధ్యత. కేవలం విద్యాబోధన చేస్తే సరిపోదని, చదువుకోవడానికి అవసరమైన కనీస వసతులు కల్పించినప్పుడే విద్య అందరికీ చేరువవుతుంది. ఇలాంటి సున్నితమైన విషయాలపై మాట్లాడేటప్పుడు వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు.

**మార్పు ఎక్కడ రావాలి?:**

గరికపాటి గారి ఉద్దేశం విద్యార్థులు కష్టపడాలనే తపనతో కూడుకున్నది కావొచ్చు, కానీ ఆయన వాడిన భాష మరియు పేదరికాన్ని తక్కువ చేసేలా ఉన్న విధానం చర్చనీయాంశమైంది. ఉచిత పథకాలు సోమరితనాన్ని

పెంచుతాయనే వాదన ఒకెత్తయితే, కనీస అవసరాలు తీరనిదే జ్ఞాన సముపార్జన సాధ్యం కాదనేది మరో వాస్తవం. ఏది ఏమైనా, ఒక గొప్ప పండితుడి నోట నుంచి వచ్చిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సమాజంలో రెండు వేర్వేరు ఆలోచనా ధోరణులను సృష్టించాయి. ప్రభుత్వం మరియు సమాజం మధ్య సమన్వయం ఉన్నప్పుడే విద్యార్థులకు మేలు జరుగుతుంది.

# జగన్ మౌనం: 'చెక్' పెట్టకపోతే చిక్కులే.. !

**హైదరాబాద్ పెన్ పవర్:** మౌనం మంచిదే అయినా.. పుట్టి మునిగిపోతున్నా.. ఇంకా మౌనంగా ఉంటామంటే.. అది మొత్తానికే చేటు చేస్తుంది. ఈ విషయం వైసీపీ అధినేత జగన్‌కు తెలియంది కాదు. గత ఎన్నికలకు ముందు కూడా.. అప్పు లు.. మద్యం.. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వంటి విషయాలు దుమ్మురేపాయి. దీనికితోడు వివేకానంద రెడ్డి హత్య ( బాబాయ్–గొడ్డలి నినాదం), చెల్లెళ్ల శోకాలు.. ఆస్తుల పంపకాలు.. వంటివి ముసురుకున్నాయి. వీటికి తోడు.. కీలకమైన నాయకుల నియోజకవర్గాల మార్పు వంటివి కూడా ఆయనకు వ్యక్తిగతంగా ఇబ్బందులు తెచ్చాయి.



అయినప్పటికీ.. జగన్ నోరు విప్పేందుకు ముందుకు రాలేదు. అసలు ఏం జరిగింది? అనేది ఇప్పటికీ చెప్పలేదు. ఇక, ఇప్పుడు మరోసారి అటు తల్లి, ఇటు చెల్లి.. ఇద్దరూ తగులుకున్నారు. గతంలో చెల్లి తన కు అన్యాయం చేశారని చెప్పగా.. ఇప్పుడు తల్లి విజయమ్మ తెరమీదికి వచ్చారు. తన కుమార్తె పిల్లలకు.. జగన్ అన్యాయం చేశారని.. పిల్లల నోటి దగ్గర ముద్దను కూడా లాగేసుకున్నారని ఆమె వ్యాఖ్యానించారు. ఈ తరహా వ్యాఖ్యలు వేరే వారు చేస్తే.. ప్రభావం పెద్దగా ఉండేదికాదు.కానీ, స్వయంగా జగన్ మాతృమూర్తి బహిరంగ లేఖ రాయడంతోపాటు.. షర్మిలను వెనుకేసుకు రావడం.. అసలు ఆస్తులే పంపకాలు జరగలేదని చెప్పడం ఇప్పుడు సెంటిమెంటును మరింత పెంచేసింది. ఈ పరిణామాలకు తోడు.. పార్టీలోనూ అసంతృప్తులు మరింత పెరుగుతున్నాయి. ఇలాంటి సమయంలో కూడా జగన్ మౌనంగా ఉండడాన్ని ఆయనకు మద్దతుగా నిలిచే బూచేపల్లి కుటుంబం నుంచి రాచమల్లు కుటుంబం వరకు.. ఎవరూ హర్షించలేక పోతున్నారు.ఆస్తుల విషయంలో ఏం జరిగిందో .. జగన్ చెప్పేస్తే.. ఈ వేడి తగ్గుతుందని, లేదా.. ఏమైనా ఇవ్వాల్సింది ఉంటే ఇచ్చేస్తే ఈ రగడకు ఫుల్ స్టాప్ పడిపోతుందని అంటున్నారు. లేకపోతే.. ఎన్నికల వరకు ఈ వివాదాలు ఇలానే కొనసాగితే.. మరింత డ్యామేజీ తప్పదని వారు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో రాచమల్లు ప్రసాదరెడ్డి.. పార్టీ అధినేతకు అంతర్గత లేఖ రాసినట్టు తెలిసింది. ఏం జరిగిందో చెప్పేయాలని ఆయన తెలిపినట్టు సమాచారం. మరి ఇప్పటికైనా జగన్ నోరు విప్పుతారో లేదో చూడాలి.

# భారత్-ఐర్లాండ్ టీ20 సిరీస్ షెడ్యూల్ ఖరారు

**జూన్‌లో ఐర్లాండ్‌తో టీమిండియా రెండు టీ20 మ్యాచ్‌ల సిరీస్**

**ప్రపంచకప్ గెలిచాక భారత జట్టు ఆడబోయే తొలి టీ20 సిరీస్ ఇదే**

**జూన్ 26, 28 తేదీల్లో బెల్‌ఫాస్ట్‌లో మ్యాచ్‌ల నిర్వహణ**

**ఆఫ్ఘనిస్థాన్‌తో సిరీస్ ముగిశాక ఐర్లాండ్ పర్యటనకు వెళ్లనున్న భారత్**



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ ఛాంపియన్‌గా నిలిచిన భారత క్రికెట్ జట్టు తన తదుపరి సిరీస్‌కు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో ఐర్లాండ్‌తో రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడనుంది. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను బీసీసీఐ ప్రకటించింది. ఈ సిరీస్‌లోని రెండు మ్యాచ్‌లు బెల్‌ఫాస్ట్ వేదికగా జూన్ 26, 28 తేదీల్లో జరుగుతాయి.

2026 టీ20 ప్రపంచకప్ గెలిచిన తర్వాత భారత జట్టు ఆడబోయే తొలి టీ20 సిరీస్ ఇదే కావడం విశేషం. ఐపీఎల్ 2026 ముగిసిన అనంతరం టీమిండియా తొలుత ఆఫ్ఘనిస్థాన్‌తో ఒక టెస్టు, మూడు వన్డేల సిరీస్‌లో తలపడనుంది. జూన్ 20న వన్డే సిరీస్ ముగిసిన వెంటనే భారత జట్టు ఐర్లాండ్ పర్యటనకు బయలుదేరుతుంది. ఈ సిరీస్ పూర్తికాగానే జులై 1 నుంచి ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్ ప్రారంభమవుతుంది.

"సీనియర్ పురుషుల జట్టు 2026 జూన్‌లో ఐర్లాండ్‌లో రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం పర్యటిస్తుంది"

అని బీసీసీఐ ఒక ప్రకటనలో తెలిపింది. గత ఎనిమిదేళ్లలో భారత్ మూడుసార్లు (2018, 2022, 2023) ఐర్లాండ్‌లో పర్యటించినప్పటికీ 2007 తర్వాత బెల్‌ఫాస్ట్‌లో ఆడటం ఇదే తొలిసారని బోర్డు వివరించింది.

మరోవైపు ఐర్లాండ్ జట్టు కూడా తీరిక లేకుండా అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడనుంది. న్యూజిలాండ్‌తో చారిత్రక టెస్టు మ్యాచ్, భారత్‌తో సిరీస్, ఆ తర్వాత ఆగస్టులో ఆఫ్ఘనిస్థాన్‌తో ఐదు వన్డేల సిరీస్ ఆడనుంది.

**భారత్ – ఐర్లాండ్ సిరీస్ షెడ్యూల్:**

మొదటి టీ20: జూన్ 26 (బెల్‌ఫాస్ట్, భారత కాలమానం ప్రకారం రాత్రి 7:30 గంటలకు)

రెండో టీ20: జూన్ 28 (బెల్‌ఫాస్ట్, భారత కాలమానం ప్రకారం రాత్రి 7:30 గంటలకు)

# 15 ఏళ్ల క్రికెటర్.. ఒక్క సెంచరీతో రికార్డులు బద్దలు



**హైదరాబాద్ పెన్ పవర్:** అంతర్జాతీయ మహిళల టీ20లో రువాండా బ్యాటర్ ఫ్యానీ సరికొత్త ఘనత సృష్టించింది. నైజీరియా ఇన్విటేషనల్ మహిళల అంతర్జాతీయ టీ20 టోర్నమెంట్‌లో శుక్రవారం ఘనాతో జరిగిన మ్యాచ్‌లో ఫ్యానీ (111: 65 బంతుల్లో 17 ఫోర్లు) శతకం బాదింది. అంతర్జాతీయ టీ20ల్లో అతిపిన్న వయసులో (15 ఏళ్ల 223 రోజులు) సెంచరీ చేసిన క్రికెటర్‌గా రికార్డ్ నెలకొల్పింది. అంతేకాకుండా మహిళల అంతర్జాతీయ టీ20 చరిత్రలో అరంగేట్రంలోనే సెంచరీ చేసిన తొలి క్రీడాకారిణిగా నిలిచింది. గతంలో ఉగాండాకు చెందిన ప్రోస్కోవియా అలకో పేరిట ఉన్న రికార్డును ఫ్యానీ అధిగమించింది. అలకో 2019లో మాలీపై 116 పరుగులు చేసింది. అప్పుడు ఆమె వయసు 16 ఏళ్ల 233 రోజులు. ఇక 2005లో టౌంటన్‌లో ఇంగ్లాండ్‌పై ఆసీస్ మాజీ క్రికెటర్ కారెన్ రోల్టన్ నెలకొల్పిన ఓ రికార్డునూ ఫ్యానీ అధిగమించింది. అరంగేట్ర మ్యాచ్‌లో కారెన్ 96 పరుగులతో అజేయంగా నిలిచింది. ఇప్పుడు సెంచరీతో ఫ్యానీ ఆ రికార్డును బద్దలు కొట్టింది. మహిళల అంతర్జాతీయ టీ20 అరంగేట్రంలో అత్యధిక స్కోరు నమోదు చేసిన బ్యాటర్‌గానూ నిలిచింది. పురుషుల క్రికెట్‌లో అంతర్జాతీయ టీ20 సెంచరీ రికార్డు అత్యంత పిన్న వయస్కుడైన ఫ్రాన్స్‌కు చెందిన గుస్తావ్ పేరిట ఉంది. 18 ఏళ్ల 280 రోజుల వయసులో అతడు స్విట్జర్లాండ్‌పై సెంచరీ చేసి రికార్డు సృష్టించాడు. దీంతో ఫ్యానీ అంతర్జాతీయంగా తక్కువ వయసులోనే శతకం చేసిన క్రికెటర్‌గా అవతరించింది.మొదట బ్యాటింగ్ చేసిన రువాండా 3 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది. అనంతరం భారీ లక్ష్య ఛేదనలో ఘనా కేవలం 88/8 స్కోరుకే పరిమితమై ఓటమి పాలైంది. తన అద్భుతమైన శతక ఇన్నింగ్స్‌కు ఫ్యానీ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచింది.

# ఒక్క క్షణం వృథా చేయొద్దు.. ఈసారి మరింత పోటీ: విరాట్ కోహ్లీ వార్నింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వరుసగా రెండోసారి కప్పును నెగ్గాలని చూస్తోంది. ఇప్పటికే స్టార్ ఆటగాడు విరాట్ కోహ్లీ సాధన మొదలుపెట్టేశాడు. అయితే, ఈసారి పోటీ తీవ్రంగా ఉంటుందని.. ఒక్క క్షణం కూడా వృథా చేయొద్దని సహచరులను హెచ్చరించాడు. ఈ మేరకు తమ జట్టు ప్రాక్టీస్‌కు సంబంధించి ఆర్సీబీ ఓ వీడియో గ్లింప్స్‌ను షేర్ చేసింది. అందులో ప్రధాన కోచ్ ఆండీ ఫ్లవర్ జట్టులోకి వచ్చిన కొత్త ప్లేయర్లకు స్వాగతం పలికాడు. ఈ సందర్భంగా సీజన్‌లో ఎలాంటి పోటీ ఉంటుందో విరాట్ కోహ్లీ ఉద్బోధించాడు."గత మూడు సీజన్లలో మన కుర్రాళ్లు చాలా కష్టపడ్డారు. గతేడాది మనం ఛాంపియన్‌లుగా నిలిచాం. అయితే, ఈసారి మరింత పోటీ ఉండబోతోంది. ఇతర జట్లు కూడా బలంగా ఉన్నాయి. మనకున్న ఈ కొన్ని రోజుల్లో ఒక్క క్షణం కూడా వృథా చేయొద్దు. మనమే ముందుండాలి. ఈ రెండున్నర నెలలు 120 శాతం శ్రమిద్దాం. సవాళ్లను ఎదుర్కొనేందుకు మీరంతా సిద్ధంగా ఉన్నారని మిమ్మల్ని చూస్తుంటేనే అర్థమవుతోంది" అని విరాట్ కోహ్లీ అన్నాడు.

**మనం స్క్వాడ్‌ను బలోపేతం చేశాం: ఆండీ**

"కొత్త సీజన్ ప్రారంభానికి ముందు జట్టుతో కలిసిన ప్లేయర్లకు స్వాగతం. ఇటీవల అండర్ -19 వరల్డ్ కప్‌ను నెగ్గిన భారత జట్టులో సభ్యులు కనిష్క్, విహాన్‌కు శుభాకాంక్షలు. గత వేలం చాలా ఆసక్తికరంగా మారింది. మన స్క్వాడ్‌ను చాలా బలంగా మార్చుకున్నాం. నాణ్యమైన ఆటగాళ్లను ఎంపిక చేసుకున్నాం. ఈ సీజన్‌లోనూ మెరుగైన ఆటతీరు ప్రదర్శిస్తామని ఆశిస్తున్నా" అని ప్రధాన కోచ్ ఆండీ ఫ్లవర్ వెల్లడించాడు.

**మళ్లీ ఆర్సీబీదే టైటిల్: అశ్విన్**

"ఐపీఎల్ టైటిల్‌ను నెగ్గడం ఏ జట్టుకైనా సులువేం కాదు. ఇప్పుడున్న స్క్వాడ్‌తోనే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రెండోసారి విజేతగా నిలుస్తుందని భావిస్తున్నా. జట్టు పునర్నిర్మాణంలో ఆర్సీబీ చాలా తెలివిగా వ్యవహరించింది. హేజిల్ వుడ్ అందుబాటులోకి వచ్చి.. ఫిల్ సాల్ట్ ఫామ్ అందుకొంటే ఆర్సీబీకి తిరుగుండదు" అని మాజీ క్రికెటర్ అశ్విన్ వ్యాఖ్యనించాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో ఆర్సీబీ తన తొలి మ్యాచ్‌ను మార్చి 28న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది.

# ఉస్తాద్, ధురంధర్.. ఊపిరి పోసినట్లే..



ఎరుపు రంగులో జ్యోతి పూర్వాజ్ స్టన్స్







శోభితా ధూళి పాళ లుక్ హైలైట్

ఉగాది పండుగ సందర్భంగా ఉస్తాద్ భగత్ సింగ్, ధురంధర్: ది రివెంజ్ చిత్రాలు.. థియేటర్స్ లో రిలీజ్ అయిన విషయం తెలిసిందే. అయితే ఆ రెండు సినిమాలు కూడా బాక్సాఫీస్ వద్ద కొత్త జోష్ తీసుకు వచ్చినట్లు తెలుస్తోంది. ఎందుకంటే ఫిబ్రవరి నెల అంతా బాక్సాఫీస్ వద్ద నిరాశే మిగిల్చింది. పెద్ద సినిమాలు లేకపోవడం, విడుదలైన చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోవడంతో థియేటర్లలో కలెక్షన్లు వీక్ గా కనిపించాయి.

2026 సంక్రాంతి సందర్భంగా వచ్చిన సినిమాల ఎఫెక్ట్ తగ్గిన తర్వాత, టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద అనుకున్న స్థాయిలో సందడి కనిపించలేదు. నిర్మాతలు, ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు కొత్త హిట్ కోసం ఎదురుచూస్తూ ఉండగా, మార్చి నెల ప్రారంభం కూడా పెద్దగా ఆశలు రేకెత్తించలేదు. అయితే ఆ పరిస్థితిని ఒక్కసారిగా మార్చేసిన రెండు సినిమాలు ఉస్తాద్ భగత్ సింగ్, ధురంధర్ ది రివెంజ్.ఆ రెండు చిత్రాలు విడుదలైన తొలి రోజు సాలిడ్ వసూళ్లు సాధించాయి.. ముఖ్యంగా ఉస్తాద్ సినిమా తెలుగు రాష్ట్రాల్లో మొదటి రోజు రూ.37 కోట్లకు పైగా నెట్ వసూళ్లు సాధించినట్లు తెలుస్తోంది. అదే సమయంలో ధురంధర్ కూడా అన్ని భాషల్లో కలిపి తెలుగు రాష్ట్రాల్లో దాదాపు రూ.10 కోట్ల గ్రాస్ వసూళ్లు రాబట్టినట్లు సమాచారం. అలా రెండు సినిమాలు కూడా మంచి ఓపెనింగ్స్ అందుకున్నాయని చెప్పాలి.ఇప్పుడు ఆ రెండు సినిమాల విజయంతో ఫిబ్రవరి నెలలో నెలకొన్న బాక్సాఫీస్ నిరుత్సాహం ఒక్కసారిగా తొలగిపోయింది. ప్రేక్షకులు మళ్లీ థియేటర్లకు రావడం ప్రారంభించడంతో ఎగ్జిబిటర్లలో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ముఖ్యంగా వీకెండ్ కలెక్షన్లు కూడా భారీగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఎందుకంటే అడ్వాన్స్ బుకింగ్స్ ఫుల్ జోష్ లో జరుగుతున్నాయని వినికిడి.అయితే ఉస్తాద్ సినిమా విషయానికొస్తే.. ఇది కంప్లీట్ మాస్ ఎంటర్టైనర్‌గా ప్రేక్షకులను ఆకట్టుకుంటోందని అర్థమవుతోంది. కథ, యాక్షన్ సన్నివేశాలు, సంగీతం.. సినిమాకు పాజిటివ్ ఎలిమెంట్స్ గా మారినట్లు తెలుస్తోంది. మరోవైపు ధురంధర్ 2 కూడా తన కథనం, ప్రెజెంటేష న్‌తో ప్రేక్షకుల నుంచి మంచి రెస్పాన్స్ అందుకుని దూసుకుపోతోంది.

ఏదేమైనా సంక్రాంతి తర్వాత వచ్చిన గ్యాప్ ను ఆ రెండు సినిమాలు భర్తీ చేయడం విశేషం. సాధారణంగా ఇది పరీక్షల సమయం కాబట్టి.. సినిమాలకు కొంత కష్టమైనదిగా భావిస్తారు. కానీ సరైన కంటెంట్ ఉంటే ఎప్పుడైనా ప్రేక్షకులు థియేటర్లకు వస్తారనే విషయాన్ని ఉస్తాద్, ధురంధర్ ది రివెంజ్ నిరూపించాయి. మొత్తానికి, ఫిబ్రవరి నెలలో ఏర్పడిన నిరాశ పరిస్థితికి ముగింపు పలుకుతూ ఉస్తాద్ భగత్ సింగ్, ధురంధర్ సినిమాలు బాక్సాఫీస్ కు కొత్త ఊపిరి పోశాయని చెప్పాలి. మరి ఆ రెండు సినిమాలు ఎంతటి వసూళ్లు సాధిస్తాయో అంతా వేచి చూడాలి.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At Shop No: 9, Bunny Xerox, Rtc Comlex, Kavali, Nellore Dist, Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2835" e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965